www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం 21 డిసెంబర్ 2024
సంపుటి :06 సంచిక : 203 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH



## కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట

- పది రోజుల వరకూ అరెస్టు చేయవద్దని ఆదేశాలు
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు
- హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ
- తదుపరి విచారణను 27కి వాయిదా
- అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పకుండా ఏసీబీ కేసులా?
- హైకోర్టులో కేటీఆర్ తరపు లాయర్ల వాదనలు
- సీజన్ 9 వల్ల దాదాపు రూ.700 కోట్లు లాభం
- రేసింగ్ ఒప్పందాన్నిఉల్లంఘించిన కొత్త ప్రభుత్వం
- కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దు
- ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు
- సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు
- ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ జరజాలి
- ప్రజా ప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి
- ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు చెప్పింది
- సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు

2 లో



### తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం

## ప్రపంచ స్థాయి ఎదగాలి

### - రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**రెండు రోజుల పాటు జరుగనున్న జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు**

2 లో..

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:** 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్ లో రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ లోని పిజే టీ ఏ యూ క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనల్ని ప్రారంభించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్ ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల

## కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ విచారణకు హాజరైన ఎంఎల్ సి,ప్రొఫెసర్ కోదండరాం



2 లో..

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:** శాసనమండలి సభ్యులు, టిజేఎస్ అధ్యక్షుడు,ప్రొఫెసర్ కోదండరాం శుక్ర వారం బీఆర్ కె భవన్‌లో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ బహిరంగ విచారణకు హాజరయ్యారు. ఈ

## మహిళల సంక్షేమం కోసమే చట్టాలు

- భర్తలను బెదిరించడానికి కాదు
- కుటుంబానికి బలమైన పునాదిగా వివాహ వ్యవస్థ
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

2 లో..



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 ( వెలుతురు):** వివాహ వ్యవస్థను హిందువులు పవిత్రమైనదిగా, కుటుంబానికి బలమైన పునాదిగా భావిస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. అది

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

- వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం
- ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్
- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం




9 లో..

**హైదరాబాద్,డిసెంబర్20( వెలుతురు):** తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

## ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

- రూ. 600 కోట్లు లూటీకే ఫార్ములా ఈ-రేస్
- విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వివరణ



## కాపలా కుక్కలు వేట కుక్కలుగా మారి భూ దోపిడి చేశాయి

### - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- భూ దోపిడీ పై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం
- తప్పు చేసింది ఆ దొరవారు, శిక్ష అనుభవించింది అమాయక ప్రజలు
- రెండు పిల్లుల రొట్టె కథ ఈ ధరణి
- మద్దెల కృష్ణయ్య పరిస్థితి మరొకరికి రాకుండా భూ భారతి చట్టం
- శాసనసభలో శుక్రవారం భూభారతి 2024 రెవెన్యూ చట్టంపై చర్చ సందర్భంగా
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు

9 లో..

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:** తెలంగాణ రాష్ట్రం ఇస్తే చాలు రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానన్న గత ప్రభుత్వ పెద్దలు వేటకుక్కలుగా మారి అందినకాడికి దోచుకున్నారని ,కాపలా కుక్కలు వేట కుక్కలుగా మారి రాష్ట్రంలో భూదోపిడీ చేశాయని ఈ దోపిడి పై ఫోరెన్సిక్ ఆడిట్ చేపిస్తామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు."సమాజంలో అట్టడుగు వర్గాలు మొదలుకొని భూ యజమానులకు మేలు చేసే విధంగా విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణతో రూపొందించిన 2024 భూ భారతి చట్టం అక్షరాలా భూ యజమానులకు చుట్టంను తీసుకు వచ్చమని

## హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**హరియాణా, డిసెంబర్ 20( వెలుతురు):** ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా (89) శుక్రవారం కన్నుమూశారు. గురువారం రాత్రి

2 లో..

## యూజీసీ నెట్ పరీక్షల తేదీలు మార్పు

- జనవరి 3నుడి పరీక్షలు
- రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు
- 85 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు
- కొత్త షెడ్యూల్ ను వెల్లడించిన యూజీసీ

9 లో..

**న్యూఢిల్లీ,డిసెంబర్ 20( వెలుతురు):** జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడేందుకు అర్హత సాధించే యూజీసీ నెట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా యమ డిమాండ్ ఇంటుంది. అందుకే ప్రతీయేట ఈ పరీక్షను రెండు సార్లు యూజీసీ



*తెలంగాణ అసెంబ్లీ లాబీలో మిర్యాలగూడ ఏమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) గారి మర్యాద పూర్వకంగా కలిసిన బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి, జాజుల లింగం గౌడ్*

హైదరాబాద్
వెలుతురు
డిసెంబర్ 20:

## ఆకస్మిక తనిఖీలు చేస్తా..

- బియ్యం అక్రమ రవాణాను అరికడతాం
- బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ పై కఠినంగా ఉంటాం
- త్వరలో రైతులకు అందుబాటులోకి సైలోస్ సిస్టమ్
- ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి



9 లో..

**అమరావతి, డిసెంబర్ 20( వెలుతురు):** ఏపీ సీఎం చంద్రబాబుకృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తర్వాత, రైతులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడించారు. "గోనె సంచులు ఎక్కడ నుంచి వెళ్లాయో అనే దానిపై కచ్చితంగా ఉంటాం. బియ్యం అక్రమ రవాణాను అరికడతాం. బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్

## ఇంకా సీఎం సీఎం అంటున్నారు.. డిప్యూటీ సీఎం అయ్యాను కదా!

- నన్ను పనిచేసుకోనివ్వండి
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



9 లో..

**అమరావతి, డిసెంబర్ 20 వెలుతురు:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పార్వతీపురం జిల్లాలోని గిరిజిన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాగుజోల అనే గిరిజన గ్రామంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఓజీ

## కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ విచారణకు హాజరైన ఎంఎల్‌సి,ప్రొఫెసర్ కోదండరాం

(మొదటి పేజీ తరువాయి..)

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో ఉన్న లోపాలను, నిబంధనల ఉల్లంఘనలను కమిషన్ ముందు ఉంచారు.విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం కమిషన్‌కు ఇప్పటికే ఒక అఫిడవిట్ సమర్పించిన దానికి అనుబంధంగా మరొక లేఖను కూడా సమర్పించారని తెలిపారు. “ప్రాజెక్టు నిర్మాణం ఇంజనీర్ల సూచనలకు వ్యతిరేకంగా చేపట్టబడింది. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించడం సరైన పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు,” అని కోదండరాం వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల అప్పులు తప్ప నీళు రాలేదని విమర్శించిన ఆయన, ప్రాజెక్టు డిజైన్‌లో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. “కాళేశ్వరం కమీషన్‌కు ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేశాను. దానికి అనుబంధంగా మరొక లేఖను పంపించాను,” అని ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్టు డిజైన్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, “తెలంగాణ మలిదశ ఉద్యమానికి ముందే గోదావరి జలాలపై చారిత్రక అధ్యయనం చేశాం. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో నీటిని అందించడానికిరూపొందించబడింది. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ల అభ్యంతరాలను వ్యతిరేకించి అమలు చేశారు,” అని అన్నారు.కాగ్ నివేదికలో ప్రాజెక్టు నిబంధనలు ఉల్లంఘించబడినట్లు స్పష్టం చేసిందని ప్రస్తావిస్తూ, “బీఆర్ఎస్ నాయకులు మేమే కట్టినాం అంటున్నారు. కానీ, కట్టినవి పని చేయాలి కదా?” అని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ పనికిరాదని సీయూసీ ఇప్పటికే తేల్చిచెప్పిందని, తుమ్మిడిహట్టి వద్ద నిర్మాణం చేపట్టాలని కోదండరాం డిమాండ్ చేశారు.

**ఫార్ములా వన్ రేస్ అంశంపై స్పందన**

కేటీఆర్ ఫార్ములా వన్ రేస్ కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్పిదమని కోదండరాం విమర్శించారు.”క్యాబినెట్ అనుమతి లేకుండా అలాంటి నిర్ణయం తీసుకోవడం తగదు. కేటీఆర్‌పై చర్యలు తప్పక అవసరం,” అని కోదండరాం అభిప్రాయపడ్డారు.

**కొత్త కారు కొనుగోలుపై వివరణ**

కొత్త కారు కొనుగోలుపై వచ్చిన విమర్శలపై స్పందించిన కోదండరాం “నా కారు చాలా తిరిగింది. కొత్తది కొనడం తప్పనిసరి. ఎమ్మెల్సీ అయ్యాక ఇచ్చే లోన్ ద్వారా కొత్త కారు కొనుగోలు చేశాను,” అని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో టిజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, సర్దార్ వినోద్ కుమార్, రవికాంత్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమం కోసమే చట్టాలు

వ్యాపార సాధనం కాదని తెలిపింది. మహిళల సంక్షేమం కోసమే ప్రభుత్వాలు కఠినమైన చట్ట నిబంధనలను రూపొందించాయని వ్యాఖ్యానించింది. అంతే కానీ భర్తలను వేధించి, బెదిరించి, శిక్షించి, ఆస్తిని దండుకోవడానికి కాదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. భార్యను క్రూరంగా హింసించారని, వేధింపులకు గురిచేశారని, అత్యాచారం చేశారనే ఆరోపణలన్నింటినీ ప్యాకేజీగా కూర్చి నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ల ప్రకారం భర్త, అతడి కుటుంబ సభ్యులపై కేసులు పెడుతున్నారని ధర్మానం పేర్కొంది. తీవ్ర మనస్పర్థలతో విడివిడిగా నివసిస్తున్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో భార్యకు శాశ్వత భరణం కింద రూ.12 కోట్లను నెలలోగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. అతడిపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేసింది. భార్య తరఫున గట్టిగా బేరసారాలు చేసేందుకు భర్త, అతని కుటుంబ సభ్యులపై తీవ్రమైన నేరారోపణలు చేయటం కూడా పరిపాటిగా మారిందని ధర్మాసనం ఆక్షేపించింది. ఈ డిమాండ్లలో అత్యధికంగా ఆర్థికపరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం తెలిపింది. గృహ హింస ఫిర్యాదులతో రంగంలోకి దిగే పోలీసులు కూడా భర్త తరఫు బంధువుల్లో వృద్ధులను, అనారోగ్యంతో ఉన్నవారిని కూడా అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తున్నారని, ఈ ఘటనలన్నీ గొలుసుకట్టు మాదిరిగా ఉంటాయని పేర్కొంది. తన భర్తకు రూ.5 వేల కోట్ల ఆస్తులున్నాయని, అతడి తొలి భార్యకు రూ.500 కోట్లను భరణంగా ఇచ్చారు కనుక తనకూ అదే స్థాయిలో చెల్లించాలన్న పిటిషనర్ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. కుటుంబ కోర్టు నిర్ణయించిన రూ.12 కోట్ల భరణాన్ని ఖరారు చేసింది. విడాకులు తీసుకున్న తర్వాత మాజీ భర్తకు వ్యాపారంలో నష్టాలు వచ్చి దివాలా తీస్తే మాజీ భార్య వచ్చి ఆ కష్టాల్లో ఏమైనా భాగం పంచుకుంటుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

## హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

ఆయనకు గుండె పోటురాగా, ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆయనను వైద్యులు రక్షించలేకపోయారని పార్టీ అధికార ప్రతినిధి తెలిపారు.మాజీ ఉపప్రధాని దేవీలాల్ కుమారుడైన ఓం ప్రకాశ్ చౌతాలా హరియాణాకు ఐదు సార్లు (1989 నుంచి 2005 వరకు) ముఖ్యమంత్రిగా పనిచేశారు. హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. “చౌతాలా చాలా ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా పని చేశారు. తన తండ్రి దేవీ లాల్ పనులను మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేశారు” అని ఎక్స్ వేదికగా మోదీ ట్వీట్ చేశారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతిపై హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ట్వీట్ చేశారు. ‘చౌతాలా మరణం చాలా బాధాకరం. ఆయనకు నా నివాళులు. ఆయన తన జీవింతాంతం రాష్ట్రానికి, సమాజానికి సేవ చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు’ అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల హరియాణా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేంద్ర సింగ్ హుడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. “ఓం ప్రకాశ్ చౌతాలా సీఎంగా ఉన్నప్పుడు నేను లోక్‌సభ సభ్యునిగా ఉన్నాను. మా మధ్య మంచి స్నేహ సంబంధం ఉండేది. చౌతాలా ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఆయన ఎప్పుడూ యాక్టివ్?గా ఉండేవారు. ఆయన ఇంత తొందరగా మనల్ని విడిచి వెళ్లిపోతారని నేను ఊహించలేదు. ఆయన చాలా మంచి వ్యక్తి, నాకు పెద్దన్నయ్య లాంటివారు” అని అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మరణవార్త చాలా బాధాకరం. ఆయన హరియాణాకు, దేశానికి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను’ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు.

# తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రపంచ స్థాయి ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి..)

నాగేశ్వరరావు, పీజేటీఏయూ ఉపకులపతి అల్దాస్ జానయ్య తో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. తర్వాత విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ అభివృద్ధికి అసమాన సేవల్ని అందించిందన్నారు. సోనామసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భవిష్యత్ ప్రణాళికల అమలులో విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని గవర్నర్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ నీ ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ విద్యని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఫీజులు తగ్గించడం స్వాగతించదగినదన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదం ఇచ్చిన





మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీద ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం వాతావరణ మార్పులు వంటి కొత్త సవాళ్లని ఎదుర్కొని మంచి భవిష్యత్తు దిశగా అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గవర్నమెంట్ పిలుపునిచ్చారు. ఉదయం ఉత్సవాల ప్రారంభ సదస్సులోనూ.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన కిసాన్ మేళా లోను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం భవిష్యత్తులో దేశానికి దిక్సూచిగా మారాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలు, మన నేల స్వభావానికి తగ్గట్లుగా అనువైన పంటలు, అందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు అందించాలని విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వ్యవసాయ సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. రైతు బీమా, రైతు రుణమాఫీలతో పాటు సంక్రాంతి తర్వాత రైతు భరోసాను అమలు చేస్తామన్నారు. హార్టికల్చర్, పంటలు, కూరగాయలు పామాయిల్ సాగు పెరగాలన్నారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి చేయుతనిస్తామన్నారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో వ్యవసాయ పట్టభద్రులు రావాలని వ్యవసాయ రంగంలో అధిక జనాభా నిమగ్నం కావాలని తుమ్మల ఆకాంక్షించారు. దేశ ప్రధానుల చేతుల మీద ప్రారంభమైన విశ్వవిద్యాలయం రైతాంగానికి ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఉందని ఆయనన్నారు. గత కొన్నేళ్లుగా ఈ విశ్వవిద్యాలయం వెనుకబాటుకి గురి అయింది అని.. దాని అధిగమించి పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని ఉపయోగించుకుని పరిశోధన, విస్తరణ విద్యలో ముందుకెళ్లాలని మంత్రి సూచించారు. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి 10 ర్యాంకుల్లో నిలవాలని తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతి వ్యవసాయ కళాశాల పరిధిలో ఒక “మోడల్ అగ్రికల్చర్ ఫార్మ్” ను అభివృద్ధి చేయాలన్నారు. వాతావరణ మార్పుల కనుగుణంగా కరికులమ్ లో రీసెర్చ్ లో మార్పులు తీసుకురావాలని, ఆర్టిఫిషియల్, డిజిటల్ టెక్నాలజీలను వినియోగించుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వజ్రోత్సవ ఉత్సవాల ప్రారంభ సమావేశంలో భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత ఉపకులపతి అల్దాస్ జానయ్య తో తనకు పూర్వం నుంచి పరిచయం ఉందని ఆయన నాయకత్వంలో విశ్వవిద్యాలయ అభివృద్ధి పథాన సాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గత విజయాలతో సంతృప్తి చెందకుండా భవిష్యత్తు లక్ష్యాల్ని నిర్దేశించుకోవాలన్నారు. నిధుల లభ్యత తగ్గడం వల్ల పరిశోధనలు వెనుకబడుతున్నాయని ఆ విషయంపై దృష్టి సారించాలన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఆహార ధాన్యాల ఉత్పాదక గణనీయంగా పెరిగిందన్నారు. తెలంగాణలో నీటిపారుదల సౌకర్యాలు, ఆహార ధాన్యాలు ఉత్పత్తి బాగా పెరిగిందన్నారు. అయితే కూరగాయలు, ఉద్యానవన పంటలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామనిదీన్నిఅధిగమించాలన్నారుఅదేవిధంగా వ్యవసాయ విద్యనభ్యసించిన వాళ్ళు కేవలం ఉద్యోగాల కోసమే చూడకుండా ఎంటర్ ప్రెన్యూర్ లుగా తయారు కావాలని రమేష్ చంద్ సూచించారు. గతంలో రైతులకి దక్కిన గౌరవం నేడు దక్కడం లేదని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ %వీ%. కోదండ రెడ్డి అన్నారు. రైతుకి వ్యవసాయానికి మూలమైన విత్తనాలు 90 శాతం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమని ఆయనన్నారు. ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు, వ్యవసాయ సంక్షేమం ప్రథమ ప్రాధాన్యాలని అందుకు అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేయాలన్నారు. శాస్త్రవేత్తలు గ్రామాల్ని దత్తత తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో సహకార వ్యవసాయ విధానం అవసరమని కోదండ రెడ్డి అన్నారు. రైతు సుఖంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూమి, విత్తనం, నీరు, రైతు చెమట వ్యవసాయానికి ఆధారాలన్నారు. మన వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశానికి తలమానికంగా ఉండాలని ఆకాంక్షించారు. పురుగుమందుల రహిత వ్యవసాయం కోసం మనమందరం కృషి చేయాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శించడం గొప్ప అనుభవం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికిచర్యలుతీసుకోవాలన్నారు.

ఈమధ్య ప్రధాని 131 కొత్త వంగడాలు విడుదల చేశారని వాటిలో కనీసం మన విశ్వవిద్యాలయం వంగడాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు.

విద్య, పరిశోధన, విస్తరణల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ జన్యు మార్పిడి పంటల సాగు నీ అనుసరించవలసిందేనన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇక్రిసాట్, క్రిడా వంటి సంస్థల సహకారం తీసుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీలని వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల కష్టాలు నాటికి నేటికి అలానే ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. ధరల పెరుగుదల, వాతావరణ మార్పులకి అనుగుణంగా రైతులకి చాలా చేయవలసి ఉందని ఆయన అన్నారు. వందేళ్ళ క్రితమే వ్యవసాయంగా ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ చెప్పారని మరో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సమరసింహా రెడ్డి అన్నారు. వ్యవసాయానికి అవసరమైన అన్నింటిని రైతులకు అందుబాటులో ఉంచాలని సమరసింహారెడ్డి సూచించారు. 60 ఏళ్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తానాన్ని పీజేటీఏ యూ ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. నాటి ప్రధానులు లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ లు, రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, ఉపరాష్ట్రపతి మొరార్జీ దేశాయ్ లు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం చుట్టూ సుమారు 10 భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వల్ల హైదరాబాద్ విత్తన రాజధానిగా రూపొందిందని జానయ్య వివరించారు. 60 ఏళ్లలో సుమారు 500 వంగడాలని విడుదల చేశామన్నారు. అదేవిధంగా సుమారు 32 వేల మంది గ్రాడ్యుయేట్లు బయటకొచ్చారన్నారు. 12 రాష్ట్రాల్లో సుమారు 3 కోట్ల ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపొందించిన వరి విత్తనాలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇతర పంటల్లోనూ విశ్వవిద్యాలయం రూపొందించిన వంగడాలు విస్తృత వ్యాప్తి పొందాయన్నారు. 21 పేటెంట్లు సాధించామన్నారు అలాగే పౌల్ట్రీ, పశుసంవర్ధక రంగాల్లోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అపూర్వ ప్రగతి సాధించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల విశ్వవిద్యాలయం ప్రయాణం పై ఒక లఘు చిత్రాన్ని విడుదల చేశారు. అలాగే వివిధ సాగు పద్ధతులపై అనేక ప్రచురణల్ని కూడా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఏపీసీ రఘునందన్ రావు, కమిషనర్ బి. గోపి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్ రాజు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజి రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, పద్మశ్రీ గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై . వెంకటేశ్వర రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవ రెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్ రావు, పూర్వ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కిసాన్ మేళా వేదికపై పలువురు తమ రైతులకు ఈ సందర్భంగా అవార్డులను బహుకరించారు,



# కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట

- ఈ నెల 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు
- కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు.
- అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు
- కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు
- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు

హైదరాబాద్, డిసెంబర్ 20( వెలుతురు):



తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై క్వాష్ పిటిషన్ వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరఫు లాయర్లు జస్టిస్ శ్రవణ్ కుమార్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత పిటిషన్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో పై హైకోర్టులో విచారణ జరిగింది. పది రోజుల వరకూ కేటీఆర్ ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరు వర్గాల న్యాయవాదులు హెూరాహెూరీగా వాదనలు వినిపించారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు లాయర్ సుందరం వాదించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో స్పాన్సర్ వెనక్కి జరిగినప్పుడు... ఈవెంట్ నిర్వహించకపోతే హైదరాబాద్ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందనే ఈ నిర్ణయం జరిగిందని కేటీఆర్ తరపు లాయర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 18 నాడు ఫిర్యాదు వస్తే 19 నాడు %ఖీ×=% చేశారు... ఎలాంటి ప్రాథమిక దర్యాప్తు చేయకుండా %ఖీ×=% చేశారన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో అక్రమాలు జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తు లేదని వాదించారు. 2023 అక్టోబర్ లో చేసుకున్న అగ్రిమెంట్ పరకారమే %ఖీజూ% కి చెల్లించారని.. అగ్రిమెంట్ ప్రకారం చెల్లింపులు చేస్తే ఉల్లంఘన ఎలా అవుతుందని కేటీఆర్ తరపు లాయర్ ప్రశ్నించారు. పబ్లిక్ సర్వెంట్ నేర పూరిత దుష్ప్రవర్తన చేస్తే పీసీ యాక్ట్ పెట్టాలి.. కానీ ఫార్ములా ఈ కార్ రేసింగ్ లో క్రిమినల్ మిస్ కాండక్ట్ నేర (పూరిత దుష్ప్రవర్తన) ఎక్కడ జరగలేదు..13(1)a, 409 అనే సెక్షన్ లు వర్తించవన్నారు. 2024 లో ఖచ్చితంగా నిర్వహించాలనే ఈ చెల్లింపులు జరిగాయి..కాంగ్రెస్ ప్రభుత్వం FEO కు మిగతా డబ్బులు చెల్లించేందుకు నిరాకరించిందన్నారు. ప్రాథమిక దర్యాప్తు జరపకుండా కేసు రిజిస్టర్ చేయడం చట్ట విరుద్ధమనిఅఫెన్స్ జరిగిందని తెలిసాక మూడునెలల లోపే కేసు రిజిస్టర్ చేయాలన్నారు. 11నెలల తర్వాత కేసు నమోదు చేశారు ..లలిత కుమార్ వర్సెస్ యూపీ కేసులో సుప్రీంకోర్టు ఆర్డర్ ఈ కేసులో వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్ రిసింగ్ నిర్వహించడానికి 2022 అక్టోబర్ 25నే ఒప్పందం జరిగిందని.. సీజన్ 9 లో 110 కోట్ల రూపాయల లాభం వచ్చిందని తెలిపారు. సీసన్ 10 కోసం ఓ సంస్థ తప్పుకుంది...దీంతో ప్రభుత్వం ప్రమోటర్ గా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. పాత ఒప్పందానికి కొనసాగింపుగా కొత్త ఒప్పందం జరిగిందని.. ఎన్నికల కోడ్ ఉల్లగించారనడానికి ఎలాంటి అధారాలు లేవన్నారు. ప్రొసీజర్ పాటించలేదు అనడం సరైంది కాదన్నారు. ఈ విషయంలో కేటీఆర్ లబ్ది పొందేలదన్నారు. ప్రాథమిక విచారణ జరిగాకే కేసు నమోదైందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. రెండు నెలల క్రితం %హీూఖణ% చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ ఫిర్యాదు చేశారని.. విచారణకు గవర్నర్ కూడా అనుమతించారని కోర్టుకు తెలిపారు. దానికి సంబంధించిన పేపర్లు ఉన్నాయా అని అడిగిన న్యాయమూర్తి.. ఏజీ ఆ పత్రాలు అందించారు. Fir ద్వారానే దర్యాప్తు జరుగుతుందని...ప్రతి విషయం fir లో ఉండదు.దర్యాప్తులో అనేక విషయాలు బహిర్గత మవుతాయన్నారు. దర్యాప్తులో ఈ కేసులో భాగస్వామ్య లైన వాళ్ళ పేర్లు బయటకు వస్తాయని.. విదేశీ కంపెనీకి ప్రజధనం బదిలీ అయ్యింది ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది అత్యవసర పిటిషన్ విచారణ కాదన్నారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసుకు అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు వర్తించవని అన్నారు. ‘ఈ కేసుకు ముఖ్యంగా 13(1)(%ఖ%), 409 సెక్షన్లు వర్తించవు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరికాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ లేకుండా కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబర్ 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కు తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది.’ అని పేర్కొన్నారు. ‘సీజన్ 9 వల్ల దాదాపు రూ.700 కోట్లు లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దైంది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. వాటిని ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. ఈ నెల 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు.’ అని కేటీఆర్ తరపు లాయర్ సుందరం వాదించారు. అటు, ఈ వ్యవహారంపై ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు వినిపించారు. ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమేనని.. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదని అన్నారు. ‘ఏసీబీ అధికారులు దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. 2 నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. దీనిపై గవర్నర్ నిర్ణయానికి పంపారు. ఆయన ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు విదేశీ కరెన్సీలో డబ్బు చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థిక శాఖ అనుమతి కూడా తీసుకోలేదు.’ అని ఏజీ పేర్కొన్నారు. ఈ క్రమంలో గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. కాగా, చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. ఎఫ్ఐఆర్ నమోదు దర్యాప్తు కోసమేనని.. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఈ వ్యవహారంలో రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు.

# రాష్ట్రపతి ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, ముఖ్యమంత్రి లు

- రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన అధికారులు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:**
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్ర వారం నాడు ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ కు వచ్చిన ముర్ము  బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ. సీతక్క లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి ,ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో జరిగిన టీజేఎస్ ప్లీనరీ

- పాల్గొన్న కోదండరాం






**వెలుతురు, యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 20:**
చౌటుప్పల్ పట్టణ0 లో శుక్ర వారం నాడు జరిగిన టీజేఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్లీనరీలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, టీజేఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, టీజేఎస్ పార్టీ ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని, ప్రత్యేకంగా యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధికి పార్టీ అహర్నిశలు పాటుపడుతుందని ఆయన వివరించారు. ప్రజాస్వామ్య విధానాలు ప్రజల అవసరాలను ప్రతిబింబించాలని కోదండరాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా మరియు మండల అధ్యక్షులు. గ్రామ స్థాయి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

- ఉత్తర- ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలే అవకాశం
- రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు

**అమరావతి, డిసెంబర్ 20( వెలుతురు):**



పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 12 గంటల్లో ఉత్తరం వైపు కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. తదుపరి 24 గంటల్లో ఉత్తర- ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఉత్తర, కోస్తా జిల్లాలో భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రానున్న 24 గంటల్లో ఏపీలోని కాకినాడ, అల్లూరి, అనకాపల్లి, విశాఖ, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్ఠంగా 60 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రానున్న రెండు రోజులుపాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కళింగపట్నం నుంచి మచిలీపట్నం వరకు ఉన్న అన్ని పోర్టులలో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గడిచిన 24 గంటలలో విజయనగరం జిల్లా మెంటాడలో 6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 'పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావం ఉత్తర కోస్తా జిల్లాల్లో ఉంటుంది. ఉత్తర ఆంధ్రలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ చేపల వేటక వెళ్లొద్దని హెచ్చరిస్తున్నామని  ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, విశాఖ వాతావరణ కేంద్రం శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్?లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ రైతులు తీవ్రంగా నష్టపోయారు. నర్సీపట్నంతో పాటు గొలుగొండ, నాతవరం, రోలుగుంట, కోట ఉరట్ల, మాకవరంపాలెంలో వరి పొలాలు నీటమునిగాయి. వర్షానికి పొలాల్లో కుప్ప పెట్టిన వరి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ ను కాలుష్యం నుంచి కాపాడే బాధ్యత అందరిది

- మంత్రి పొన్నం ప్రభాకర్



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:**
వన మహోత్సవం -2024 కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ వెనుక భాగం లో గల లింక్ రోడ్డు  ప్రాంతంలో పెద్దయెత్తున చేపట్టే ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డీ, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ,అటవీ శాఖ  అధికారులు,ఇతర అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుందన్నారు,యావత్ తెలంగాణ ప్రజలు ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రతి పౌరుడు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సంకల్పం తీసుకోవాలని మంత్రి ప్రభాకర్ కోరారు,రాబోయే కాలంలో హైదరాబాద్ ను కాలుష్యం నుండి రక్షించే బాధ్యతను నగర వాసులు తీసుకోవాలన్నారు, దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడింది,వలస పోయి వేరే దగ్గర బతుకే పరిస్థితి ఉందని అలాంటి పరిస్థితి ఇక్కడ రాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,హైదరాబాద్ అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది,కాలుష్యాన్ని నివారించడానికి వాహనాలకు ఈవీ



పాలసీ తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు,హైదరాబాద్ నగరంలో అన్ని వాహనాలు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు ఆటోలు ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని మంత్రి తెలిపారు,కాల పరిమితి పూర్తి చేసుకున్న జీహెచ్ఎంసీ వాడే వాహనాలు స్క్రాప్ కి ఇచ్చి ఈవి వెహికిల్ గా మారుస్తామనీ మంత్రి ప్రభాకర్ తెలిపారు,15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్ పాలసీ తీసుకొచ్చా మని ఆయన తెలిపారు, చెట్లు చాలా అవసరం సామాజిక బాధ్యత గా రోజు వారి కార్యక్రమాల్లో మొక్కలు నాటడం పెంచడం చేసుకోవాలని సూచించారు, ప్రజలందరికీ విజ్ఞప్తి వాతావరణాన్ని కాపాడడానికి..పర్యావరణం కాపాడడం  మన అందరి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు,

# అల్లు అర్జున్ పై ఢిల్లీలో ఫిర్యాధు చేసిన రాచాల

- ప్రచార మోజులో ప్రాణాలు తీసిన అల్లు అర్జున్
- ప్రేక్షకులను కంట్రోల్ చేయలేమని పోలీసులు హెచ్చరించినా లెక్కలేనితనం
- దానివల్ల ఓ నిండు ప్రాణం బలి.. చావు బతుకుల మధ్య శ్రీ తేజ
- ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించిన అల్లు అర్జున్, ప్రొడక్షన్ టీం, థియేటర్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి
- జాతీయ మానవ హక్కుల కమిషన్ కు రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 20:**
ప్రచార మోజులో ప్రాణాలు తీసిన అల్లు అర్జున్, ప్రొడక్షన్ టీం, సంధ్య థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ కు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాధు చేశారు. ఈమేరకు శుక్రవారం న్యూఢిల్లీ లోని జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో




ఫిర్యాధు చేసిన అనంతరం తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4, 2024న హైదరాబాద్ లోని సంధ్య థియేటర్లో పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ దుష్ప్రవర్తన మరియు నిర్లక్ష్యం కారణంగా మానవ హక్కులను తీవ్ర భంగం వాటిల్లిందన్నారు. ప్రేక్షకులను కంట్రోల్ చేయలేమని పోలీసులు హెచ్చరించినా లెక్కలేనితనంతో నటుడు అల్లు అర్జున్ వచ్చారని, దానివల్ల ఓ నిండు ప్రాణం బలైందని, ఆమె కుమారుడు శ్రీతేజ చావు బతుకుల మధ్య ఉన్నాడని కమిషన్ కు తెలిపారు. ఈ సంఘటన జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇచ్చే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 యొక్క స్పష్టమైన ఉల్లంఘన అని, అల్లు అర్జున్ ఉద్దేశపూర్వక దుష్ప్రవర్తన, థియేటర్ మేనేజ్‌మెంట్ మరియు ప్రొడక్షన్ టీమ్ నిర్లక్ష్యంతో ప్రజా భద్రత ప్రమాదంలో పడిందని, మరియు కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రజా భద్రతను నిర్ధారించడంలో మరియు పోలీసు సలహాలను పాటించడంలో థియేటర్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ నిర్వాహకులు మరియు అల్లు అర్జున్ సంయుక్తంగా విఫలమైనందున శ్రీమతి రేవతి మరియు ఆమె కుమారుడు శ్రీ తేజ్ యొక్క మానవ హక్కులు ఉల్లంఘించబడ్డా యని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ సేఫ్టీ మరియు పబ్లిక్ ఈవెంట్‌ల కోసం పోలీసుల సలహాలను కఠినంగా అమలు చేయడం కోసం కఠినమైన ప్రోటోకాల్‌ల సూత్రీకరణను సిఫార్సు చేయాలని కోరారు. ఈ సంఘటన మరణించిన వారి కుటుంబానికి కోలుకోలేని దుఃఖాన్ని కలిగించిందని మరియు  చిన్నారి శ్రీ తేజ్‌కు తీరని బాధ కలిగించిందని, బాధితులకు న్యాయం జరగడానికి మరియు బాధ్యులకు జవాబుదారీగా ఉండేలా ఈ గౌరవ కమిషన్ తక్షణ జోక్యం అవసరమని పేర్కొన్నారు. కమిషన్ ను కలిసిన వారిలో బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుక రామ్మూర్తి గౌడ్, బిసి పొలిటికల్ జెఎసి సలహాదారు బడేసాబ్, నాయకులు రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్, మహిందర్ నాయుడు, గౌతమ్ శంకర్, దేవర శివ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం

- సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్

**సూర్యాపేట జిల్లా వెలుతురు డిసెంబర్ 20:**
సూర్యాపేట జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన కోదాడలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రత్యేక ఆహ్వానితులుగా కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ సామినేని ప్రమీల, కోదాడ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య  హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి కె. అశోక్  మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయడానికి కృషి చేసిన అన్ని కమిటీల కన్వీనర్లు,కో-కన్వీనర్లకు సభ్యులకు  ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. సూర్యాపేట జిల్లా





విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి కె. అశోక్ గారితో ఆహ్వాన కమిటీ కన్వీనర్లు జెల్లా ప్రసాద్,సూర్యాపేట మండల విద్యాధికారి  శేషగాని శ్రీనివాస గౌడ్ మరియు కో- కన్వీనర్లు పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్ రెడ్డి,తీగల నరేష్,టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి అరవిందు,కస్తూరి కిషన్ ప్రసాద్,తెలంగాణా పీఆర్టీయూ మిట్టగడపుల రాంమోహన్,టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్,సోంబాబు,సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ మరియు టీయుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కటకం నరసింహస్వామి,టీజీయూఎస్ తరపున ధరావత్ మోతిలాల్ నాయక్,బాణోత్ రామా నాయక్,టీపీయూఎస్ తరపున పర్వతం సంధ్యా రాణి,యామా రమేష్,టీఆర్టీయూ తరపున గులాం జహంగీర్,నారాయణ సతీష్,డీటీఎఫ్ రేపాక లింగయ్య,వెంకటేశ్వర్లు,టీపీటీఎఫ్ రామ నర్సయ్య,భిక్షం, టీపీటీయూ నిమ్మల శ్రీనివాస్ నాయుడు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం..

# ఇంట్లోకైనా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా ?

ఏ సినీ నటుడు మోహన్ బాబు ఫ్యామిలీ వ్యవహారంపై కొంత కాలంగా సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. సెలబ్రిటీలు, సామాన్యులు ఇలా ఎవరి ఇంట్లోకి అయినా అనుమతి లేకుండా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా అనేది ప్రశ్న. ఎవరిదైనా ప్రైవేటు స్థలం లేదా భవనంలోకి ఇతర వ్యక్తులు ప్రవేశించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతోంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 329 ప్రకారం, అనుమతి లేకుండా ఇతరుల భవనాలు, స్థలాల్లోకి చొరబడటం ట్రెస్ పాసింగ్ అనే నేరం కిందకు వస్తుంది. దానికి సందర్భం, కారణాలను బట్టి మూడు నెలలు, ఏడాది వరకు జైలు శిక్ష ఉందని చట్టం చెబుతోంది. ఈ విషయంలో జర్నలిస్టులకు ఎలాంటి మినహాయింపు లేదు. భారతదేశ చట్టాల ప్రకారం జర్నలిస్టులు, సామాన్య పౌరులు అంతా సమానమే. మీడియా వారైనా సరే, ఏ సామాన్యుడి ఇల్లు అయినా, సెలబ్రిటీ ఇల్లు అయినా వారి గోడ దాటి అనుమతి లేకుండా లోపలికి ప్రవేశిస్తే వారిపై ఆ భవన యజమాని కేసు పెట్టవచ్చు. బ్లిక్ పర్సనాలిటీల వ్యక్తిగత వ్యవహారంపై ప్రజలందరికీ ఉత్సాహం ఉంటుంది. అందుకే మీడియా దాన్ని రిపోర్ట్ చేయవలసి వస్తుంది. అదే సందర్భంలో మీడియాపై భౌతిక దాడి సరికాదు. తప్పు చేస్తే చట్టపరంగా వెళ్లాలి అనేది జర్నలిస్టుల వాదన. చొరబడటంలో కూడా చాలా రకాలున్నాయి. ఆయుధాలతో రావడం, రహస్యంగా రావడం, గోడ దూకడం, రాత్రి వేళ రావడం, గేట్లు పగలగొట్టడం.. ఇలా నేరాన్ని బట్టి కేసు తీరు మారుతుంది. ఒకవేళ వేరే వారు అక్కడ గేట్లు పగలగొట్టినా ఆ దారిలో మీడియా వాళ్లు వెళ్ళడం కూడా చట్ట ప్రకారం నేరమే. ఈ స్థలం ఫలానా వారిది ట్రెస్పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ అని సాధారణంగా కొన్ని ఖాళీ స్థలాల దగ్గర బోర్డులు పెడుతుంటారు. అనుమతి లేకుండా ప్రవేశించిన వారు శిక్షార్హులు అని దీనర్థం. నిబంధన ఇంటికి, ఇతర ప్రైవేటు స్థలాలకు కూడా వర్తిస్తుంది. మీడియా వారికి, సెలబ్రిటీలకు కూడా ఇందులో మినహాయింపు లేదు. కాకపోతే, అమెరికా వంటి దేశాల్లో ఇది అందరూ పాటిస్తారు. మనదేశంలో చట్టాలపై అవగాహన తక్కువ కాబట్టి, ఎక్కువ మంది దీన్ని గౌరవించరు. కానీ, ఎవరైనా గట్టిగా నిలబడి కేసు పెడితే, కచ్చితంగా చొరబాటు చేసిన వారికి శిక్ష పడుతుంది అంటున్నారు న్యాయనిపుణులు. అంతేకాదు, తమ స్థలం లేదా భవనంలోకి చొచ్చుకు వస్తున్న వారిని ఆపే హక్కు కూడా ఆ స్థల యజమానులకు ఉంటుంది. అయితే దాని అర్థం భౌతిక దాడులు చేయవచ్చని కాదు. వారిని ప్రవేశించకుండా ఆపవచ్చు అని మాత్రమే చట్టం చెబుతోంది. సాధారణంగా దొంగతనం కోసం, దాడులు చేయడం కోసం, ఆక్రమణ కోసం ఎవరైనా ప్రాపర్టీలోకి వస్తే ట్రెస్పాసింగ్ కేసులు పెడతారు. కానీ మాట్లాడటం కోసం, సమాచారం కోసం, లేదా అసలు ఏ ఉద్దేశం లేకుండా ఊరికే ఇతరుల స్థలంలోకి వెళ్లినా కేసు పెట్టవచ్చా అంటే అవుననే చెబుతోంది చట్టం. అంటే ఇక్కడ చొరబాటుదారుని లక్ష్యం ముఖ్యం కాదు. కాకపోతే ఉద్దేశాన్ని బట్టి శిక్ష తీవ్రత మారవచ్చు. కానీ, అసలు ఏ చెడు ఉద్దేశం లేకుండా వెళ్లినా నేరం నేరమే.ఎందుకంటే, రేపు ఎవరో ఒకరు నీ ఇంటి ముందుకు వచ్చి కూర్చుంటారు. నాకే ఉద్దేశమూ లేదు. ఊరికే మీ ఇంటి ముందు నుంచుంటా అంటే చెల్లదు కదా? బోర్డు పెట్టినా, పెట్టకపోయినా, ప్రతి ప్రైవేటు ఆస్తి మీద యజమానికి హక్కు సహజంగా ఉంటుంది. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే జర్నలిస్టులపై 2020లో ఈ తరహా కేసు పెట్టించారు. తన నివాసంలోకి అక్రమంగా చొరబడ్డారు అంటూ రిపబ్లిక్ టీవీ రిపోర్టర్, కెమెరా పర్సన్, ఆ బండి నడిపిన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అలాగే 2018లో చెన్నైలోని ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను వీడియో తీస్తున్న ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టమవుతోంది. చట్ట ప్రకారం పోలీసులు కూడా ప్రైవేటు ప్రాపర్టీలోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం ఉండాలి. ఒకటి వారికి ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండాలి లేదా, వారికి అక్కడ తీవ్రమైన నేరం, తక్షణం ఆపించాల్సిన నేరం జరుగుతోందన్న కచ్చితమైన సమాచారం వచ్చి ఉండాలి, లేదా కోర్టు లేదా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం వచ్చి ఉండాలి. అప్పుడే మాత్రమే పోలీసులు ప్రైవేటు ప్రాపర్టీలోనికి అడుగు పెట్టగలరు. అయితే భారతదేశంలో చాలా వరకు ఈ చట్టం మీద అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్న వారు కూడా పోలీసులతో అనవసర గొడవ ఎందుకు అనుకుని ఊరుకోవడం సహజంగా కనిపిస్తుంది. ఇక, చొరబడటం మాత్రమే కాదు ఒక వ్యక్తి వెంటపడటం, వెంబడించడం కూడా శిక్షార్హమైన నేరమే. తరచూ వెంటబడటం, ఎక్కడకు వెళ్లినా వెనకాలే వెళ్లడం వంటివి చట్ట ప్రకారం స్టాకింగ్ అనే నేరం కిందకు వస్తాయి. అయితే విస్తృతమైన ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న అంశాల్లో కొన్ని సార్లు మీడియా వెళ్లాల్సి రావచ్చు. అప్పుడు కూడా అది చట్ట వ్యతిరేకమే అయినప్పటికీ విస్తృతమైన ప్రజాప్రయోజనం ఉంది కాబట్టి దాన్ని వెలికితీయడానికి కాస్త రిస్క్ తీసుకోవడం అవసరం అనే వాదన చేయచ్చు. కానీ, అప్పుడు కూడా అది అంతగా ప్రజాప్రయోజనంతో ముడిపడింది అవ్వడం, అందులో కూడా వ్యక్తుల ప్రైవసీకి భంగకరం కాని రీతిలో వ్యవహరించడం లాంటి అంశాలు ముడిపడి ఉంటాయి. చీటికి మాటికీ ఎక్కడ పడితే అక్కడికి మైకులు తీసుకుని దూసుకువెళ్లే అధికారం సాధారణ ప్రజలకు ఎలా ఉండదో మీడియాకు కూడా ఉండదు. దాదాపు పదేళ్ళ క్రితం చిరంజీవి ఇంట్లో ఒక ప్రైవేటు కార్యక్రమం జరిగినప్పుడు ఒక ఇంగ్లీషు పత్రిక ఫోటోగ్రాఫర్ గోడదూకి ఆ కార్యక్రమం లోపలికి వెళ్లారు. అప్పుడు అతనిపై పవన్ కళ్యాణ్ భౌతిక దాడి చేశారు. తరువాత ఫిలిం చాంబర్ లో సినిమా పెద్దలు ఆ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తాజాగా మోహన్ బాబు ఇంటిలోకి మీడియా వెళ్లింది. ఆయనా దాడి చేశారు. ఈ మధ్య ఒక తెలంగాణ నార్కొటిక్స్ అధికారిని ఇంటర్వ్యూ ఇవ్వమంటూ ఒక మహిళా జర్నలిస్టు మీదమీదకు వెళ్లిన ఘటన కూడా ఇటువంటిదే. చిరంజీవి ఘటన సమయంలోనూ ప్రైవసీ అనే అంశం చర్చకు వచ్చింది. మీడియా కూడా తనకున్న పరిమితులు తెలుసుకోవాలి. అందరి ప్రైవసీని మీడియా గౌరవించాల్సిందే. దాన్ని ఉల్లంఘించే హక్కు లేదు. మీడియా కూడా తన పరిమితులు తెలుసుకుని, అక్కడ ఏం జరుగుతోందో చెప్పవచ్చు. రిపోర్ట్ చేయవచ్చు. కానీ ఆవేశపూరిత పరిస్థితులు కుటుంబంలో ఉన్నప్పుడు మధ్యలోకి వెళ్లకూడదు. మీడియా ఆవేశంలో వెళ్లడం పొరబాటు అనిపిస్తుంది. కానీ దానికి ప్రతిగా భౌతిక దాడి చేయడం కూడా సరికాదు. కొందరు అవగాహన లేని మీడియా ప్రతినిధులు అత్యుత్సాహం చూపుతుంటారు. జర్నలిజంలో ఏబీసీడీలు, పాత్రికేయ విలువలు, ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటివి తెలియని వారు మీడియాలోకి రావడం వల్ల కూడా సమస్య వస్తోంది. గత కొన్ని రోజులుగా సినీ నటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మనోజ్‌కు మధ్య వివాదం తలెత్తింది. జల్‌పల్లిలోని ఇంట్లోకి తనను రానివ్వలేదంటూ మంచు మనోజ్ మీడియా తీసుకుని ఆ ఇంటివద్దకు వెళ్లారు. అదే సమయంలో సెక్యూరిటీ మనోజ్ దంపతులను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే మనోజ్ గేటు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లారు. అక్కడే ఉన్న మోహన్‌బాబును ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. ఆయన ఆగ్రహాని గురయ్యారు. అతని మైక్‌తోనే మీడియా ప్రతినిధిని కొట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే తనపై నమోదైన కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు మోహన్ బాబు. గురువారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చింది.అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఎవరి తప్పు ఎంత ఉన్నదో...న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాలి. హైకోర్టు తీర్పు కోసం తెలుగు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

# భారత్‌కు ట్రంప్ బెదిరింపు!

**హైదరాబాద్, డిసెంబర్ 20 వెలుతురు:**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలన ఎలా ఉండబోతోందో ఇప్పటికే ఒక అంచనా ఏర్పడింది. ఆయనలో బెధిరింపు దోరణి ఎక్కువగా కనిపిస్తోంది. అగ్రరాజ్య అధినేత అనే అహంకారం అది. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ ఓపెన్‌గా చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్యపోరును ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మనదేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్థం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు.ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై



193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు,లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతోంది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది. ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ 'అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు. అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు. మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగ పరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్‌పి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.


# ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?




**హైదరాబాద్, డిసెంబర్ 20 వెలుతురు:**
ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళ్లు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు! ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా! మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

# ఆచితూచి మాట్లాడండి.. మంత్రులకు చంద్రబాబు సూచన

**అమరావతి, డిసెంబర్ 20 వెలుతురు:**
ఈ టెక్ జమానాలో ఆడియో, వీడియో ఎడిటింగ్ లు పీక్ స్టేజికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఇక, ఏఐ, డీప్ ఫేక్ వంటి అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత దానిని సద్వినియోగం చేసేవారికన్నా దుర్వినియోగం చేసేవారే ఎక్కువ. ఇక, ఒక ఉద్దేశ్యంతో నేతలు మాట్లాడిన మాటలను తమకు అనుకూలంగా ప్రచారం చేసే ప్రత్యర్థి మీడియాల సంగతి సరేసరి. ఈ క్రమంలోనే ఏపీలోని ఎన్డీఏ కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు కీలక సూచన చేశారు. ఢిల్లీలో పార్లమెంటు దగ్గర పరిణామాలపై కేబినెట్ భేటీలో చర్చించిన చంద్రబాబు కీలక సూచనలు చేశారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్ కు తగిన గౌరవం లభించలేదని, కాంగ్రెస్ హయాంలోనే ఆయన ఓడిపోయారని గుర్తు చేశారు. వీపీ సింగ్ హయాంలో పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని, అంబేద్కర్ కు ఎవరి ద్వారా గుర్తింపు వచ్చిందన్న అంశంపై చర్చ జరగాలని చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నితమైన అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలని, మంచి ఉద్దేశంతో మాట్లాడినా చెడుగా ప్రచారం చేసేవారు ఉంటారని దిశానిర్దేశం చేశారు. గతంలో తాను వ్యవసాయం దండగ అని అనకపోయినా అన్నట్టుగా దుష్ప్రచారం చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై దుమారం రేగిన నేపథ్యంలో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక, ఉదాసీనంగా ఉండొద్దని,



మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఐవీఆర్ఎస్ అభిప్రాయ సేకరణ జరుపుతున్నానని అన్నారు. మంత్రుల పనితీరు, ప్రభుత్వ పనితీరు ఆధారంగా ఫీడ్ బ్యాక్ తెప్పించుకుంటున్నామని తెలిపారు. 6 నెలల పనితీరుపై నిమ్మల రామానాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మాత్రమే సెల్ఫ్ అప్రైజల్ ఇచ్చారని, మిగతా వారు ఇవ్వలేదని కాస్త అసహనం వ్యక్తం చేశారు. పేషీలకు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని మంత్రులకు సూచించారు. సోషల్ మీడియాను కొందరు మంత్రులు సద్వినియోగం చేసుకోవడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కక్ష సాధింపు ధోరణి వద్దని, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవు పలికారు.

# ఆ కేసుపై రేవంత్ కు కేటీఆర్ సవాల్

**హైదరాబాద్, డిసెంబర్ 20 వెలుతురు:**
2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో స్కామ్ జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏకు చెందిన రూ.45 కోట్ల నిధులను విదేశీ కంపెనీలకు మళ్లించడం వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ తోపాటు కొందరు అధికారులపై ఏసీబీ నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసింది. తనపై కేసు నమోదైన నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తున్న సమయంలో ఈ కేసు విషయం తెలుసుకన్న కేటీఆర్ సభలోనే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్ రేసింగ్ లో కుంభకోణం అని ఆరోపిస్తున్నారని, ఈ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సభలో ఆ అంశంపై చర్చకు తాను సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరారు. ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరముందని, ఈ ప్రభుత్వానికి ధైర్యం ఉంటే అసెంబ్లీలో ఆ అంశంపై చర్చ పెట్టాలని, సమాధానాలు చెప్పేందుకు తాను సిద్ధమని ఛాలెంజ్ చేశారు. ఇక, కేటీఆర్ పై కేసు నమోదు కావడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ఖండించారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలాగా ఈ కార్ రేసింగ్ నిర్వహిస్తే ఇలా కేసులు పెడతారా అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము చేస్తున్న ఆరోపణలు నిజమని నమ్మితే రేపు లేదా ఎల్లుండి అసెంబ్లీలో ఆ వ్యవహారంపై చర్చ పెట్టాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అంతకుముందు, ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ కూడా రాశారు. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో అవకతవకలు జరగలేదని, కేబినెట్ లో కాదు.. అసెంబ్లీలో చర్చ జరిగితే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆ లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం, నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. తెలంగాణ, హైదరాబాద్‌కు మంచి జరగాలని 2023లో రేస్‌ను విజయవంతంగా నిర్వహించామని, ఆర్థిక వ్యవస్థకు రూ.700 కోట్ల లబ్ధి చేకూరినందని నీల్సన్ సంస్థ నివేదిక ఇచ్చిందని లేఖలో రాశారు. ఈ ఏడాది జరగాల్సిన రేస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు.

# ఘనంగా గుంటకండ్ల సునీత జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ సూర్యాపేట మండల మాజీ జెడ్పీటీసీ జిడి బిక్షం, బి ఆర్ ఎస్ నాయకులు



**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**

మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంట కండ్ల జగదీష్ రెడ్డి సతీమణి, ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గుంతకండ్ల సునీత జన్మదిన వేడుకలను సూర్యాపేట మాజీ జెడ్పిటిసి జీడి బిక్షం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి జిడి బిక్షం మాట్లాడుతూ ఎస్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ సునీత జగదీష్ రెడ్డి ప్రజల మన్ననలు పొందారని అన్నారూ. కలిసిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రమణ రెడ్డి, యాదగిరి, వెంకట్ రెడ్డి, అశోక్, శంకర్ నాయక్, వాసుదేవ రెడ్డి, సుదర్శన్, ఈదుల యాదగిరి, మహేష్, చందు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం




**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**

అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా పార్లమెంటులో మాట్లాడిన కేంద్రం హోం మంత్రి అమీత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు ఏకలక్ష్మి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తలమళ్ళ హస్సేన్ ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, టి పి టి ఎల్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు జే నరసింహారావు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు ఐద్వా కోశాధికారి మేకన బోయిన సైదమ్మ కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పిండిగ నాగమణి కెవిపిఎస్ నాయకులు సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు.

# మూసి నీటిని తక్షణమే విడుదల చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి.

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**



మూసి ఆయకట్టు పరిధిలోని రైతులు పంట పొలాలు దున్ని నాట్లు పెట్టుకునేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు ఎంవియన్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రబీ సీజన్లో వరి నాట్లు వేసుకునేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ రెండో వారంలో నీటిని విడుదల చేస్తున్న అధికారులు ఈ సంవత్సరం ఇంకా నేటి విడుదలకు షెడ్యూల్ రూపొందించకపోవడం సరికాదన్నారు. నీటిని ఎప్పుడు విడుదల చేస్తారని రైతాంగం మూసి అధికారులను అడిగితే మాకు ప్రభుత్వం నుండి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని అన్నారు. నిండుకుండ లాగా ఉన్న మూసి నీటిని కాలువల ద్వారా విడుదల చేస్తే బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరిగి రైతాంగానికి పంట పొలాలు దున్నడానికి నాట్లు వేయడానికి ఉపయోగపడతాయని అన్నారు. వృధాగా నీటిని ఏరులోకి విడుదల చేయడం మూలంగా రైతాంగానికి ఎలాంటి ఉపయోగం ఉండదని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మూసీ అధికారులు వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన చేసిన వ్యాఖ్యలపై నిరసనగా అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం

**వెలుతురు న్యూస్ నూతనకల్ డిసెంబర్ 20**



నూతనకల్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు భారత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని నూతనకల్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బొజ్జ శ్రీనివాస్ బత్తుల తిరుమలేష్ పోలేపాక శ్రీనివాస్ బానాల విజయ్, లక్ష్మణ్,లింగయ్య, మహేష్ సౌనయ్య,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలి

- అందమైన ఆతిథ్యం.. పసందైన వంటకం
- హైదరాబద్ కు పోటీగా సూర్యాపేట లో పెరుగుతున్న నయా ఫుడ్ కల్చర్

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**

సూర్యాపేట లోని విద్యానగర్ లో జాజు రెస్టారెంట్ ను ప్రారంభించిన పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ సూర్యాపేట లోని విద్యానగర్ లో జాజు రెస్టారెంట్ ను ప్రారంభించిన పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణా రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ ఈ సందర్భంగా కొప్పుల వేణా రెడ్డి మాట్లాడుతూ వ్యాపార సంస్థలు నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలి అని కోరారు.రాష్ట్రంలోనే అందమైన పట్టణం సూర్యాపేట అని అన్నారు. సూర్యాపేట పట్టణంలో భోజనప్రియులను



ఆకట్టుకునేలా కొత్తగా హొటళ్లు వెలుస్తున్నాయి. హైదరాబాద్ సిటీని పోలిన విధంగా నయా ఫుడ్కల్చర్ మొదలైంది. బ్రాండెడ్ దుస్తుల షాపింగ్ మాల్స్, బిర్యానీ సెంటర్లు క్యూ కడుతున్నాయి. సకల హంగులతో హొటల్స్ ప్రారంభమవుతున్నాయి. అభివృద్ధి కి హొటళ్లలో అందించే ఆతిథ్యం



సరికొత్త పుంతలు తొక్కుతున్నది. ఎల్లప్పుడూ కొత్తదనం కోరుకునే వినియోగదారులను వినూత్న థీమ్లతో ఆకట్టుకుంటున్నది. కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా హొటళ్లు, రెస్టొరెంట్లు.. పసందైన విందుతోపాటు వినోదాన్ని అందించేందుకు పెద్దపీట వేస్తున్నాయి అని అన్నారు.



# ఆటో కార్మికుల అరెస్టు అన్యాయం

## - ఏ ఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్.

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**

జిల్లా లోని నడిగూడెం మండల కేంద్రం లో శుక్రవారం నాడు ఆటో యూనియన్ నాయకులను, కార్మికులను అకారణంగా ముందస్తు అరెస్టు చేయటాన్ని తెలంగాణ పబ్లిక్ & ప్రయివేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ పెడరేషన్ (సీఐటీయూ & ఏ ఐ ఆర్ టి డబ్ల్యు యఫ్ ల అనుబంధం )సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యస్ యాదగిరి, యం. రాంబాబు ఖండించారు. శుక్రవారం నాడు నడిగూడెం మండల కేంద్రం లో ఆటో కార్మికులను పోలీసులు అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.స్వయం ఉపాధి ద్వారా ప్రజలకు రవాణా సౌకార్యాన్ని నిత్యం అందిస్తూ ఆటో కార్మికులు జీవనం సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక మహిళలకు ఉచిత బస్ చేయటం వలన అదాయాలు కోల్పోయి కుటుంబాలు సాకటం కష్టం గా మారిందన్నారు. వస్తున్నకొద్ది ఆదాయం కూడా జరిమానాలకే సరి పోతుందన్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారము చేయటం లేదు, పోరాటాలు చేయకుండా నిర్బందం ఉపయోగించటం ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ఆటో కార్మికులకు సంవత్సరానికి పన్నెండు వేలు ఇవ్వాలని, సమస్యల పరిష్కారం కొరకు రవాణా కార్మికులు ఐక్యం అయి ఉద్య మించాలని పిలుపునిచ్చారు.

# అమిషాను బర్తరఫ్ చేయాలి

## కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి

- తుక్కుగూడ చౌరస్తాలో కాంగ్రెస్ నిరసన కార్యక్రమం



**వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 20:**

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అవమానించటం తగదు తుక్కుగూడ చౌరస్తాలో బాబా సాహెబ్ విగ్రహం వద్ద నిరసన కార్య క్రమంలో మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు,భారత రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకు ఎంతో మేలు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారిని కీర్తించడం.బీజేపీకి కంటగింపుగా మారిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. టీ.పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు తుక్కుగూడ మున్సిపాలిటీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు కాంగ్రెస్ శ్రేణులు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కేఎల్ఆర్ హాజరయ్యారు. కాంగ్రెస్, దళిత, బహుజన నాయకులతో కలిసి బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు అందేలా రాజ్యాంగం రూపొందించిన మహనీయుడిని అవమానించటం అమిత్ షా అహంకారానికి నిదర్శనం కేఎల్ఆర్ అన్నారు,ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, దళిత, బహుజన సంఘాలు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ, అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

- రంజోల్ లో ఇంటిటి సర్వే పరిశీలించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**

సొంత స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే పనులను కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు ఖాళీ స్థలం ఉన్న వారికి మొదటి విడత లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఇంటింటి సర్వే జరుపుతున్నట్లు తెలిపారు. సర్వేలో ఖాళీ స్థలం ఉండి ఇల్లు లేని వారికి , ఇండ్లు కూలిపోయిన వారికి, ఇల్లు శిథిలావస్థలో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రెవిన్యూ డివిజన్ అధికారి రామ్ రెడ్డి, మండల ప్రతేక్య అధికారి బిక్షపతి, ఎంపీడీఓ, తాసిల్దార్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బెతేల్ గాస్పల్ చర్చ్ లో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ...



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:**

క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బెతేల్ గాస్పల్ చర్చ్ వారు, ఆల్విన్ కాలనీ 1వ ఫేస్ లో యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ గురువారం రాత్రి నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిధిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధి, జహీరాబాద్ మండలం, న్యాల్కల్, కోహీర్ మండలాల వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 7,46,500=00 రూపాయిల చెక్కులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ గిరిధర్ రెడ్డి గెస్ట్ హౌస్ లో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ రోజు సీఎం సహాయ నిధి అందుకొన్న లబ్ధిదారులు:: 1.ఎమ్.రాజమ్మ, హుగ్గెల్లీ గ్రామంకి రూ.60,000 లు, 2.జి.వీరమణి, హుగ్గెల్లీ గ్రామంకి రూ.60,000 లు, 3.అంబయ్య, డిడ్గి గ్రామంకి రూ.60,000లు 4.జగన్నాథ్ రెడ్డి, జహీరాబాద్ కి రూ.60,000లు, 5.నారాయణ రెడ్డి, గోడిగార్ పల్లీకి రూ.60,000లు, 6.రవితేజ, జహీరాబాద్ కు రూ.60,000లు, 7.పొచాని నర్సింహులు, జహీరాబాద్ కి రూ.60,000 లు, 8.శ్రీనివాస్ రెడ్డి, అల్గోల్ కి రూ.60,000 లు, 9.బసమ్మ, అనేగుంట కి రూ.55,000 లు, 10.తుక్కారం, ఖాసింపూర్ కీ రూ.52,500 లు, 11.%వీణ%.హనీఫ్ మియా, ముర్తుజాపూర్-న్యాల్కల్ రూ.60,000 లు, 12.సుక్కమ్మ, దిగ్వాల్ కి రూ.39,000 లు, 13.సి.మల్లేశ్, పర్శపల్లీ కి రూ.60,000 లు యున్నారు. ఈ సందర్బంగా చెక్కులు అందుకొన్న లబ్ధిదారులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కు, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి కు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డికు, మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి,మాజీ వైస్ యం.పి.పి.వి.రాములు,సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి,మాజీ కౌన్సిలర్ శేఖర్,యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్ రెడ్డి,బి.మల్లీకార్జున్, సోమప్ప,రాములు మరియు తదితరులు పాల్గొన్నారు.



# జహీరాబాద్ లో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటుకు కృషి

- విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తా...
- నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక కార్యచరణ
- మొదటి ప్రాధాన్యత ఓటు వేసిభారీ మెజారిటీ తో గెలిపించండి..
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి...




**జహిరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**
పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని కరీంనగర్– అదిలాబాద్ నిజామాబాద్ –మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.. శుక్రవారం జహీరాబాద్ పట్టణ కేంద్రంలో పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు.. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ టు పీజీ వరకు అన్ని రంగాలపై అవగాహన ఉన్న తనను రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. విద్యారంగం నుండి వచ్చిన తనకు ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని, నిరుద్యోగ నిర్మూలనకు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నానని వెల్లడించారు. గతంలో గెలిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీలు నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో చాలావరకు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని అన్నారు... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే 50వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు.. ఉస్మానియా విశ్వవిద్యాలయం కింద ప్రభుత్వ కళాశాలలో పరీక్ష ఫీజులు వసూలు చేయడం బాధాకరమని అన్నారు.. గురుకుల, మోడల్, కేజీబివి లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరుకై కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ గురుకులాలలో కీచన్, మెస్,కేర్ టేకర్ సిస్టం నుసఫరెట్ వ్యవస్థ ను ఏర్పాటు చేయాలనిఅన్నారు. గత 11 రోజులుగా సర్వ శిక్ష అభియాన్ తమ న్యాయమైన డిమాండ్ల కోసం రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని, త్వరలోనే వారికి ప్రభుత్వం శుభవార్త చెబుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. 317 జీవో ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే వారి స్థానికతను బట్టి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.

## రంజోల్ బాలికల గురుకుల పాఠశాల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి...





**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**
నూతన మెనూ ఎలా ఉంది. మెనూ ప్రకారం గురుకుల పాఠశాలలో వంటలు వండుతున్నారా నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నారా అంటూ విద్యార్థులను ప్రశ్నించి, విద్యార్థుల సమస్యలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలుసుకున్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలం రంజోల్ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన మెనూ అమలుపై ప్రశ్నలను విద్యార్థుల ను అడిగి సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగది స్టోర్ రూమ్ , కూరగాయలు బియ్యం చింతపండు తదితర సామాగ్రి ఎలా ఉందని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ప్రిన్సిపల్ ఆదేశించారు. ఈ తనిఖీలో జహీరాబాద్ రెవిన్యూ డివిజన్ అధికారి రామ్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, ఎంపీడీఓ, తాసిల్దార్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణుల సమావేశం...



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:**
బాలనగర్ పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో కూకట్పల్లి , నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షురాలు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానమైన అంశాలలో ఇందిరమ్మ ఇంటి పరిశీలన, పార్టీ వ్యవహారాలు, ప్రతి బూత్ నుండి పోలింగ్ మెంబర్ లను తీసుకోవడం లాంటి విషయాలపై చర్చించారు. అదే విధంగా నియోజకవర్గంలో ఉన్న క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం ఇచ్చే సహాయ సహకారాలను అందచేయడానికి సిఫారసు చేయడం జరిగింది. అలాగే ముఖ్యమంత్రి మీటింగ్ కు సంబంధించిన ఎంట్రీ పాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, అధ్యక్షురాలు ,డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, పాస్టర్స్, క్రైస్తవ సోదరులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలపై హై కోర్టు వద్ద నిరసన

- నిరసన లో పాల్గొన్న టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పొన్నం అశోక్

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 20:**
శుక్ర వారం నాడు తెలంగాణ హైకోర్టు గేట్ నంబర్ 4 ముందు టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ లీగల్ సెల్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని పార్లమెంట్ లో కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వాక్యాలపై నిరసన తెలిపారు, ఈ సందర్భంగా అమిత్ షాని వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలనీ టీపీసీసీ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు,ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి రాపర్తి వెంకటేష్ గౌడ్, టీపీసీసీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బొడ్డు బిక్షపతి గౌడ్ ,హైదరాబాద్ చైర్మన్ కిషన్ రాజ్ చౌహన్ ,జనరల్ సెక్రటరీ మోమిన్ రోషన్,ఈ ,దేవాగౌడ్ , తారీగొప్పుల మహేందర్ ,గుండ్లపల్లి సత్యనారాయణ, శారదా కటకం, సుధారాణి ,అవనగంటి నాగిరెడ్డి ,గజ్జల సైదిరెడ్డి ,నాలాబోలు సత్యనారాయణ రెడ్డి ,పోతాంశెట్టి మనోజ్ , సీనియర్ మరియు జూనియర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు,



## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి...



### బండి రమేష్

**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:**
నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్పల్లికి చెందిన పెద్దింటి లక్ష్మి కి 60,000/- రూపాయలు, అల్లాపూర్ కి చెందిన నూలు జాన్వి 60000/- రూపాయల చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనవి. బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి సంబంధించిన 1,20,000 రూపాయల చెక్కులను బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య ,తూము వేణు పుష్ప రెడ్డి, కుక్కల రమేష్, కృష్ణ రాజ్పుత్, మొయిజుద్దీన్, రేష్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## నిశ్చితార్థం వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మంకాల్ బ్యాంకెట్స్ హాల్ లో శుక్రవారం బూర్దిపాడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జిన్నారం పెంటా రెడ్డి కుమారుని నిశ్చితార్థం వేడుకల్లో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, పిఎసిఎస్ చైర్మన్ మచ్చేందర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వహిద్ అలీ, తాజా మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, అబ్రహం, కరుణ్ రాజ్, మాజీ ఎంపిటిసి బేగరి శంకర్, హెూతి బి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పర్వేజ్, నాయకులు సతీష్, చెంద్రన్న, లాలన్న, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులు పవిత్రంగా జరుపుకునే పండుగ క్రిస్మస్

- మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్



**జహిరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ లో ప్రీ క్రిస్మస్ వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డాక్టర్ ఏ చంద్రశేఖర్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజానికానికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవుల ముఖ్యమైన పండుగ క్రిస్మస్ అని ఏసు క్రీస్తు పుట్టిన రోజును క్రైస్తవులు పండుగ చేసుకుంటారని అన్నారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని తీసుకురావాలని, ప్రజలంతా సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, మండల అధ్యక్షులు మక్సుద్, రామలింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హర్షద్ అలీ, యుత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, ముర్జల్, ఎఎంసి డైరెక్టర్ వంశీ, మొయిజ్, రాజ్ కుమార్, పాస్టర్లు రవి, రమేష్, బాబు, జైపాల్, పాల్ రాజ్ కాంగ్రెస్ నాయకులు తదితురులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ ఎల్లమ్మబండలో ఘనంగా గార్మి ఉత్సవాలు...

- కార్యక్రమంలో పాల్గొన్న వి. జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ దొడ్డ వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:**
గ్యార్మి పండుగ పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తా వద్ద ఈద్గా నందు నిర్వహించిన ఉత్సవాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. ప్రతి సంవత్సరం ఒకరి ఇంటి వద్ద నుండి సందల్ ఊరేగింపుతో దర్గా వద్దకు చేరుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుండి జెండా దర్గా వద్దకు తీసుకువచ్చి దర్గా వద్ద నిలుపుతారనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూన సత్యం గౌడ్, కావూరి ప్రసాద్, వాసు, నవీన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నవాజ్, కైజర్, సయ్యద్, రెహ్మాన్, సుల్తాన్, అబ్దుల్, కలీల్, అలహాబాక్ష, ముస్తఫా, షఫీ, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

## లోకసభ నిరవధిక వాయిదా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 ( వెలుతురు):**
లోక్సభ శుక్రవారం నిరవధిక వాయిదా పడింది. విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలో ఉన్నారు. మరో వైపు ఇవాళ ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఇండియా కూటమి నేతలు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ను అవమానించిన షా రాజీనామా చేయాలని ఇవాళ విజయ్ చౌక్ వద్ద విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. జమిలి ఎన్నికల బిల్లును జేపీసీకి లోక్సభ రిఫర్ చేసింది. మరో వైపు విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో రాజ్యసభను 12 గంటల వరకు వాయిదా వేశారు. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని స్పీకర్ బిర్లా.. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ను కోరారు. మరో వైపు సభలో విపక్షాలు జైభీం అంటూ కేకలు పెట్టారు.

# కెపిహెచ్బి లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు...

## పాల్గొన్న కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి...

**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:** కెపిహెచ్బి బైబిల్ మిషన్ రెవ.డి జాన్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుప్రభు అందరివాడని, ఆయన చూపిన మార్గాలను, ఆదర్శాలను ప్రతి ఒక్కరు జీవితంలో ఆచరించాలని, మన తోటి మనుషుల యందు దయ, ప్రేమ, కరుణ, శాంతి కలిగి ఉండాలని అన్నారు. నమ్ముట నీ వలన అయితే నమ్మువానికి సమస్తము సాధ్యమే అని ఏసుప్రభు చూపిన ఆదర్శ నియమాలను పాటించాలని తెలిపారు. ప్రజా సంక్షేమం ప్రజా పాలనలో పేదవారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ,శాంతిభద్రత విషయంలో కట్టుదిట్టమైన నియమ నిబంధనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపడుతున్నారని అన్నారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నారని ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఇన్చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, పిఎల్ ప్రసాద్, యువ నాయకుడు బచ్చుమల్లి, శ్రావణ్, జగన్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు..

## ఫార్ములా ఈ కార్ రెసింగ్ వ్యవహారంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన గాలి బాలాజీ...



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:** ఫార్ములా ఈ కార్ రెసింగ్ వ్యవహారంలో గురువారం మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను టిపిసిసి కార్యదర్శి కో ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఓ ప్రకటనలో గాలి బాలాజీ మాట్లాడుతూ ఆర్.బి.ఐ అప్పటి మీ ప్రభుత్వానికి 8 కోట్ల రూపాయలు జరిమానా విధించింది వాస్తవమా కదా? అని ప్రశ్నించారు. ఆ జరిమానా ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిది నిజమా కాదా..? అన్నారు. తప్పు చేయకపోతే ఆర్బిఐ ఎందుకు జరిమానా విధించింది కేటీఆర్ నీ ప్రశ్నించారు. అనుమతి లేకుండా విదేశీమారకం చెయ్యటం నేరం కాదా? ప్రభుత్వ అనుమతి లేకుండా రహస్యంగా 55 కోట్లను ఈ రేస్ వారికి చెల్లింపులు చేయడం తప్పు చేయడం కాదా..? ప్రజల సొమ్ముని మీరు రహస్యంగా ఎలా చెల్లింపులు చేస్తారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం పెంచటానికి ఈ రేస్ కి ఏమి సంబంధం అమెరికాలో చదివిన మీరు మాట్లాడవలసిన మాటలేనా అన్నారు. సీఎం రేవంతరెడ్డి కి భూమి ఉందని టిడిపి హయాంలో ప్రభుత్వం ఈ ఫార్ములా కోసం తీసుకుంది అందుకే ఆయనకు ఫార్ములా రేస్ అంటే పడదు అనడం సమంజసం కాదన్నారు. చాలా మంది దిగ్గజాలు వచ్చారు అంటే దాని వలన రాష్ట్రానికి గానీ ప్రజలకు గానీ జరిగిన మేలు ఏమిటి, మీ ఉద్దేశం వాళ్లపైన కేసులు పెట్టమని కోరుతున్నారా..? మీరు తప్పు చేయనప్పుడు విచారణ ఎదుర్కోవాలి గానీ హైకోర్టు లో స్క్వాష్ కి వెళ్లడం ఎందుకు అన్నారు. మేకపోతు గంబీర్యం చూపించి మేము పోరాటా యోధులం మారక్తం లోనే పోరాటం వుంది అని ప్రగాల్భాలు పలికి మళ్ళీ కోర్ట్ తలుపులు తడితే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నడుస్తున్న ప్రజా ప్రభుత్వంలో వ్యక్తిగత ద్వేషం గానీ కక్ష సాధింపులు గానీ ఉండవని, తప్పు చేసిన వారు శిక్షను అనుభవించాలి అనేది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.

# ఎస్పీ బాలసుబ్రమణ్యం చిరస్మరణీయులు




**వెలుతురు, సిటి కల్చరల్ :** తన పాటలతో అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ఖ్యాతి గడించిన ఎస్పీ బాల సుబ్రమణ్యం సంగీత చరిత్రలో చిర స్మరణీయులని ఎస్.బిఐ జనరల్ మేనేజర్, ప్రముఖ సాహితీవేత్త గరికపాటి వెంకట్ అన్నారు. తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సహకారంతో సుస్వర వాహిని సంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు అమీన్ పాషా ఆధ్వర్యం లో దివంగత పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం దివ్య స్మృ తిలో 'బాలు గోల్డెన్ హిట్స్' పేరిట సినీ సంగీత విభావరి రవీంద్రభార తిలో నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా గరికపాటి వెంకట్ పాల్గొని ఎస్పీ బాలసుబ్ర మణ్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. అ మీన్ పాషాకు అద్భుతమైన కంఠ స్వరాన్ని ఇచ్చారని ఆయన నిర్వ హణలో ఆలపించిన గీతాలు ప్రత్య క్షంగా బాలు వచ్చి పాడారనే అను భూతిని పొందినట్లు ఉందని పేర్కొ న్నారు. లక్షలాది సంగీతాభిమానుల గుండెల్లో సుస్థి రస్థానాన్ని సంపా దించేలా అమిన్ పాషా పాటలను అత్యంత అద్భుతంగా ఆలపించా రని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవ పెద్ది సు రేష్, హైదరాబాద్ సీనియర్ సిటిజ న్స్ అసోసియేషన్ మూర్తి, అచ్చంగా తెలుగు అసోసి యేషన్ ప్రతినిధి కట్టుపల్లి ప్రసాద్ ను అమిన్ పాషా ఘనంగా సన్మా నించారు.

# కేటీఆర్ పై అక్రమ కేసును ఖండించిన మాధవరం రంగారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు :** ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమ కేసులు పెట్టినందుకు తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తన స్వార్థం కోసం తన కుటుంబ స్వార్థం కోసం చేస్తున్న అరాచకాలను కేటీఆర్ ప్రతిది ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి అడ్డు తలుగుతున్నాడని కేటీఆర్ ని ఏదో ఒక విధంగా కేసులు పెట్టి జైల్లో వేయాలని చూస్తున్నాడు తప్ప రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీల మీద ఎప్పుడైనా రివ్యూ మీటింగ్ పెట్టిన దాఖలాలు లేవు అన్నారు. కేటీఆర్ ని ఏ విధంగానైనా జైల్లో వేయాలని గంటలు గంటలుగా పోలీస్ అధికారులు, తోటి మంత్రులను కూర్చోబెట్టుకొని ప్లాన్ చేయడం తన కక్షపూరిత వ్యక్తిత్వానికి నిదర్శనమని అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా నిన్నటి వరకి మీ మీద పోటీ చేసిన పట్నం నరేందర్ రెడ్డిని అక్రమ కేసు బనాయించి జైల్లో ఉంచారు ఇప్పుడు కేటీఆర్ పై అక్రమ కేసు బనాయించి జైల్లో వేయాలని చూస్తున్నారు మీరు ఎంత చేసిన భయపడే వాళ్ళు ఎవరూ లేరని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో కచ్చితంగా మీకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

# పార్లమెంటు సమావేశాల్లో దేశవ్యాప్త కుల,జన, గణనల గురించి ప్రస్తావుంచకుండా బీసీలను మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

◆ ఆనంతుల రామ్మూర్తి గౌడ్, పి.బడేసాబ్



**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 20:** పార్లమెంటు సమావేశాల్లో బీసీలకు దేశవ్యాప్త కుల జన గణన జరిపిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న బీసీలకు మొండి చేయి చూపించడం యావత్ బీసీ సమాజాన్ని మోసం చేసినట్లే అని బిజెపి ప్రభుత్వం ఇకనైనా బీసీల పట్ల సావతి తల్లి ప్రేమను విడనాడాలని, బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతల రామ్మూర్తి గౌడ్ బీజేపీ ప్రభుత్వంపై ఆవేదన వ్యక్తంచేశారు ఇదే అంశంపై బిజెపి పార్టీలో ఉన్న ఓబీసీ ఎంపీలు మరియు ప్రతిపక్షం లో ఉన్న ఓబీసీ ఎంపీలు ఎవరు కూడా కుల జన గణనపై ధోజమెత్తకుండా గల మెత్తకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా ఉండడం ఇది వారి యొక్క అమాయకత్వానికి నిదర్శనమని తన జాతికి మోసం చేసినట్లేనని రామూర్తి గౌడ్ అన్నారు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు మరియు మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు ఈ కార్యక్రమంలో వెంకటేష్,శ్రీను కర్ణకర్ నాయకులు పాల్గొన్నారు

# మానవ తప్పిదం వల్లే కూలిన హెలీకాప్టర్

## బిపిన్ రావత్ మృతిపై రిపోర్టు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 ( వెలుతురు):** త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో మొత్తం 12 మంది మరణించారు. బిపిన్ రావత్ భార్య మధులిక రావత్ కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడులోని కూనూరులో ఆ ఘటన జరిగింది. ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదికను తయారు చేసింది. ఆ నివేదికను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మానవ తప్పిదం వల్ల ఎంఐ-17 హెలికాప్టర్ కూలినట్లు రిపోర్టులో వెల్లడించారు. 2017 నుంచి 2022 వరకు భారతీయ వైమానిక దళానికి చెందిన 34 ప్రమాదాలు జరిగినట్లు స్టాండింగ్ కమిటీ రిపోర్టులో పేర్కొన్నారు.

# ఆనంద్ నగర్ కాలనీ కమాన్ కు శంకుస్థాపన



**వెలుతురు, హయత్ నగర్ , డిసెంబర్ 20:** హయత్ నగర్ డివిజన్ లోని ఆనంద్ నగర్ కాలనీ కమాన్ నిర్మాణంకు శుక్ర వారం నాడు శంకుస్థాపన కార్య క్రమాన్ని స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఆనంద్ నగర్ కాలనీ అభివృద్ధి పనులకు అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులకు సహాయ సహకారాలు ఉంటాయని కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన కాలనీవాసులకు సూచించారు,ఈ కార్యక్రమంలో ఆనంద్ నగర్ కాలనీ అధ్యక్షులు జహంగీర్ ,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చంద్ పాషా , హఫీజ్ ,సలీం బేగ్ , అలీ , నసీర్ ,ఉమర్ ,శుజత్ ,భారీ ,మరియు కాలనీవాసులు ,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే..

◆ యువ నాయకులు గాదె శివ చౌదరి



**కూకట్ పల్లి డిసెంబర్ 20 వెలుతురు:** బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని అప్పులు తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్ కుటుంబం, బి ఆర్ ఎస్ ప్రభుత్వానిదే అని కూకట్ పల్లి కాంగ్రెస్ యువ నాయకులు గాదె శివ చౌదరి అన్నారు. ఫార్ములా ఈ కార్ రెసింగ్ వ్యవహారంలో గురువారం మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి మణిహారమైన గత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నిర్మించిన హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న రింగ్ రోడ్డును అమ్మింది కూడా గత బిఆర్ఎస్ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో గత బిఆర్ఎస్ రోడ్లను కూడా అమ్ముకోవాల్సిన దుస్థితికి తీసుకువచ్చిందని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాల్లో ఓపెన్ ప్లాట్లు వేసి అమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి జరిగిందా??అభివృద్ధి పేరుతో హైదరాబాద్ అమ్మకం జరిగిందా??...అని ప్రశ్నించారు.

# లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం 74500 రూపాయలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 20** పల్లివాడ గ్రామానికి చెందిన రామన్నపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు దండిగ నరసింహ అనారోగ్య కారణం వల్ల మరణించడం జరిగినది లారీ అసోసియేషన్ తరపున సభ్యులందరు కలిసి రూపాయలు 74500 నరసింహ భార్య దండిగా శంకరమ్మ కు అందజేయడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో రామన్నపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగు ఆనంద్ యాదవ్ కార్యదర్శి పబ్బు కాటమయ్య, సభ్యులు తిరుపాల ఐలయ్య, తిరుపాల బిక్షపతి, ఆకిటి శ్రీనివాస్, బేల్లీ అంజయ్య, రేపాక రమేష్, రేముడాల భాస్కర్, వల్లపు నరసింహ, పోషగోని లింగస్వామి, గోంద్ర శ్రీశైలం, బుర్ర శ్రీశైలం, మరియు రెమడాల సతీష్ గురజాల మోహన్ రెడ్డి . అధ్యక్షులు ఆగు ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ, రామన్నపేట లారీ ఓనర్లకు ఎలాంటి ఆపద కలిగిన అండదండగా ఉంటానని పేర్కొన్నారు లారీ ఓనర్లు ఐక్యతగా ఉండి ఏ ఒక్క లారీ ఓనర్ కు ఆపద వచ్చినా ఆదుకోవాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని టిపిటిఎఫ్ ప్రాతినిధ్యం

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:** గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల సీఆర్టీలు తమ డిమాండ్ల కోసం నిరవధిక ధర్నాలు చేస్తున్నారు. వారి డిమాండ్ల సత్వర పరిష్కారానికై ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ శుక్రవారం రోజున డా బీ ఆర్ అంబేడ్కర్ సచివాలయం లో శ్రీమతి ఎస్.లక్ష్మీబాయి ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ,గిరిజన సంక్షేమ శాఖ గారికీ ప్రాతినిధ్యం చేయడం జరిగిందనీ టీ పీ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు వై. అశోక్ కుమార్, ఇంజమూరి రఘునందన్ లు పాల్గొన్నారు.



# దోటి 18వ అయ్యప్ప మహా పడి పూజ లో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి





**చందూర్ వెలుతురు డిసెంబర్ 20:**
శుక్రవారం రోజున చందూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి వెంకటేష్ యాదవ్ గురుస్వామి పదునెట్టాంబడి పూజ కార్యక్రమం శ్రీ శ్రీ శ్రీ తంత్రి సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం కలుషాబిషేకాలు వైభవం గా నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిది గా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ అయ్యప్ప పడి పూజ లో పాల్గొనడం చాలా సంతోషం గా ఉంది అన్నారు అదేవిదంగా అయ్యప్ప ఆశీస్సుల తో ఈ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో, ఉండాలని వారు కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి చేతుల మీదుగా పాదునెట్టాంబడి పుస్తకావిష్కరణ మరియు శరణు శరణు అయ్యప్ప ఆడియో పాట ను వారు ఆవిష్కరిం చడం జరిగింది.పడి పూజ కార్యక్రమంలో చింతపల్లి గిరి గురు స్వామి భజన మండలి భక్తులను అయ్యప్ప పాటల తో అలరించరించడం జరిగింది. ఈ మహోన్నత కార్యక్రమానికి చందూర్ మున్సిపల్, మండల పరిధి లోని అయ్యప్ప స్వాములు మరియు భక్తులు వివిధ మండలాల లోని ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది

# సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

- ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి..
- కరీంనగర్లో ఉద్యోగుల నిరవధిక సమ్మె కు మంచిర్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లిరఘునాథ్ సంఘీభావం...
- ప్రభుత్వ వైఖరిపై మండిపాటు...

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 20:**



సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగుల క్రమబద్ధీకరణ ను వెంటనే చేపట్టాలని మంచిర్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గత 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు శుక్రవారం రోజున రఘునాథ్ సంఘీభావం ప్రకటించి, సమ్మె దీక్ష శిబిరంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సమగ్ర శిక్షా అభియాన్ లో కాంట్రాక్ట్ పద్దతిపై విధులు నిర్వర్తిస్తున్న వేలాది మంది కార్మికులు గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్దతిన దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలను అమలు చేయడం లేదని వాపోయారు. హెల్త్ కార్డులకు నోచుకోలేదని, ఉద్యోగులు చనిపోతే కనీసం ఆర్థిక సాయం కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంతోపాటు తమ సమస్యలను పరిష్కరిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయడం లేదన్నారు. సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాల అమలు కోసం కేంద్రం 60 శాతం నిధులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తోందని, రాష్ట్రం వాటా విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తా ళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఔరంగజేబు వారసుడు రిక్షాలు నడుపుతున్నాడు

- దేవాలయాలను కూల్చివేసి, పాడు చేయడంతోనే ఈ దుస్థితి
- సీఎం యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు

**అయోధ్య, డిసెంబర్ 20( వెలుతురు):**
సనాతన ధర్మం ప్రాముఖ్యత గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ సనాతన ధర్మం సురక్షితంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉన్నారని అన్నారు. ఆపద సమయంలో ప్రతి వర్గానికి.. మతానికి ఆశ్రయం కల్పించిన ఏకైక మతం సనాతన ధర్మం అని చెప్పారు. అయితే ఇలా హిందువులకు ఎప్పుడైనా ఆశ్రయం ఇవ్వడం జరిగిందా అనడమే కాదు.. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో, అంతకు ముందు పాకిస్థాన్‌లో, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. అయోధ్యలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. 'దేశంలోని సనాతన ధర్మానికి గర్వకారణమైన స్థలాలను ధ్వంసం చేసిన వ్యక్తులు ఎవరు? ఎందుకు అలా చేశారని తాను అడగాలనుకుంటున్నానని అన్నారు. అంతెందుకు ఇలాంటి ధ్వంసం వెనుక వారి ఉద్దేశం ఏమిటంటే.. ఇలాంటి అనాగరిక చర్యల ద్వారా మొత్తం భూమిని నరకం చేయాలనే కుట్రలో ఒక భాగం అని చెప్పారు.

# విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ రాలేదని హాల్ టికెట్లు ఇవ్వకపోవడం సరికాదు

- పెండింగ్ లో ఉన్న ఫీజ్ రీయంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి

- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 20:**
ఘట్కేసర్ పరిధిలోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదివే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రాలేదని హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురు చేయటం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ అందించలేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫీజులు మొత్తం చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయని ఫీజు రియంబర్స్మెంట్ రాలేదని కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా క్యాంపస్ బయట నిలబెట్టడం సరైన పద్ధతి కాదని రియంబర్స్మెంట్తో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇచ్చి పరీక్షలు రాయించాలని శ్రీనిధి యాజమాన్యానికి, పెండింగ్ లో ఉన్న ఫీజులన్నింటిని విడుదల చేయాలనీ బీసీ సంక్షేమ సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ యాదవ్, అనంతుల సాయి, సూర్య తేజ, మధు తదితరులు పాల్గొన్నారు



# హిమాయత్ నగర్లో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

## - మహాలక్ష్మి రామన్ గౌడ్

**వెలుతురు, హిమాయత్ నగర్, డిసెంబర్ 20:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది చేపట్టిన ఆరు గ్యారెంటీ ల పథకాలలో భాగంగా, ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల పరిశీలన ను హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టారు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది చేపట్టిన ఆరు గ్యారెంటీ లా పథకాలలో భాగంగా, ఇంద్రమ్మ ఇల్లు వెరిఫికేషన్ కార్యక్రమం ఈరోజు హిమాయత్ నగర్ డివిజన్ లో జనార్ధన్ బాధ, దత్తా నగర్, ఆదర్శ బస్తీ, పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు మరియు ప్రభుత్వ అధికారులు హెచ్ఎండిఏ ఎస్ ఈ (TGHCL) వెంకట్ దాస్ రెడ్డి గారు, ఏఈ లలిత, నరసరాజు, సర్వే చేయించడం జరిగింది, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గుడి గారు ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తామన్నా అన్ని పథకాలను అమలు పరచడంలో ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని పేదవారి కళ అయినా సొంత ఇంటి కలను పూర్తి చేయడానికి మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిజమైన ప్రజాపాలన నిర్వహిస్తున్నారని అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు 200 యూనిట్ల కరెంటు 500 రూపాయలకే గ్యాస్ ఇప్పుడు పట్టణ ప్రజలకు సొంత ఇంటిని నిర్మించుకోవడానికి స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలను మరియు ఇందిరమ్మ ఇల్లు అందరికీ



అందడానికి గత ఏడాది ప్రజా పాలనలో వారు ఇచ్చిన అప్లికేషన్స్ ను వెరిఫై చేయడానికి ఇంటింటికి ప్రభుత్వ అధికారులను పంపించే సర్వే చేయించడం జరుగుతుంది, కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ జి. రామన్ గౌడ్ గారు, అశోక్, డివిజన్ అధ్యక్షులు ఎం ఏ నయీమ్, రాజేందర్ ప్రసాద్, సర్ఫరాజ్, అజర్, జి ఆర్ సందీప్, ఓం ప్రకాష్, అభిషేక్, జగదీష్, ఆదర్శ్, తదితరులు పాల్గొనడం జరిగింది.ఇళ్లు పరిశీలన ఆవాస్ కార్యక్రమం శుక్ర వారం హిమాయత్ నగర్ డివిజన్ లో జనార్ధన్ బాధ, దత్తా నగర్, ఆదర్శ బస్తీ, పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మరియు ప్రభుత్వ అధికారులు హెచ్ఎండిఏ ఎస్ ఈ (TGHCL) వెంకట్ దాస్ రెడ్డి ,ఏఈ లలిత, నరసరాజు, సర్వే చేయించడం జరిగింది, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గుడి ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తామన్నా అన్ని పథకాలను అమలు పరచడంలో ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని పేదవారి కళ అయినా సొంత ఇంటి కలను పూర్తి చేయడానికి మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన ప్రజాపాలన నిర్వహిస్తున్నారని అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు 200 యూనిట్ల కరెంటు 500 రూపాయలకే గ్యాస్ ఇప్పుడు పట్టణ ప్రజలకు సొంత ఇంటిని నిర్మించుకోవడానికి స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలను మరియు ఇందిరమ్మ ఇల్లు అందరికీ అందడానికి గత ఏడాది ప్రజా పాలనలో వారు ఇచ్చిన అప్లికేషన్స్ ను వెరిఫై చేయడానికి ఇంటింటికి ప్రభుత్వ అధికారులను పంపించే సర్వే చేయించడం జరుగుతుందన్నారు, కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ జి. రామన్ గౌడ్ ,అశోక్, డివిజన్ అధ్యక్షులు ఎం ఏ నయీమ్, రాజేందర్ ప్రసాద్, సర్ఫరాజ్, అజర్, జి ఆర్ సందీప్, ఓం ప్రకాష్, అభిషేక్, జగదీష్, ఆదర్శ్, తదితరులు పాల్గొనడం జరిగింది.



# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల పట్ల ఖండన

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**



రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తుంగతుర్తి మండల కాంగ్రెస్ నాయకులు మంగళపల్లి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించడం వలనే యావత్ జాతి రాజ్యాంగఫలాలను పొందుతుంటే భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ ను అవమానించే విధంగా సభ్య సమాజం తలదించుకునేలా అమిత్ షా మాట్లాడటం హేయమైన చర్య అని అన్నారు. అంబేద్కర్ ను అగౌరవ పరిచేలా కించపరిచి మాట్లాడటం జపం చేస్తే మేలు జరుగుతుందని చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై విమర్శ చేసే అర్హత అమిత్ షా కు లేదని కోట్లాదిమందికి అంబేద్కర్ అభిమాని అని, సామాజిక న్యాయమే ధ్యేయంగా అహర్నిశలు, శ్రమించి రాజ్యాంగాన్ని పూర్తి చేయుటకు ఎంతో కృషి చేసిన మహానీయుడని ఆయన ప్రపంచానికి ఒక దిక్సూచి అని తెలిపారు. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# పేటలో సందడి చేసిన బిగ్ బాస్ రన్నర్ డాక్టర్ గౌతమ్ కృష్ణ

- తనకు మద్దతు ఇచ్చిన యువతీ యువకులకు ధన్యవాదాలు తెలిపిన గౌతమ్ కృష్ణ

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 20**
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన బిగ్బాస్ సీజన్ 8 రన్నర్ గా నిలిచిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మూడవ వార్డుకు చెందిన సినీ నటుడు డాక్టర్ గౌతమ్ కృష్ణ సూర్యాపేట జిల్లా కేంద్రంలో సందడి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కళాశాలలో ఎల్ఐసి వెనుక ప్రాంతంలో పర్యటించి తనకు మద్దతు ఇచ్చి రన్నర్ గా నిలిపిన యువతీ యువకులకు ధన్యవాదాలు తెలిపారు. మునుముందు ఇలాగే తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. బిగ్బాస్ సీజన్ 8లో తనకు ఎదురైన అనుభవాలను అధిగమించిన సవాళ్లను అభిమానులతో కలసి పంచుకున్నారు. సందర్భంగా యువతీ యువకులు అభిమానులతో సెల్ఫీలు ఫోటోలు దిగుతూ సరదాగా గడిపారు.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యూత్ కాంగ్రెస్ కృషి చేయాలి

## - మధు యాష్కీ గౌడ్



**వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 20:**
కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్ బి నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్ ను శుక్ర వారం నాడు యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా ఎల్ బి నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని మధు యాష్కీ గౌడ్ సూచించారు, అలాగే నియోజక వర్గం లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని మధు యాష్కీ గౌడ్ కోరారు.ఎల్. బి నగర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా యూత్ కాంగ్రెస్ నాయకులు పని చేయాలని సూచించారు, కాగా మాజీ ఎంపీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మరియు ఎల్. బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని యూత్ కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు,

# వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ

**న్యూఢిల్లీ,డిసెంబర్ 20 ( వెలుతురు):**
కృత్రిమ మేధ వేదిక ఓపెన్ ఏఐ మరో కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి చాట్‌జీపీటీ కోసం ఎలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోనక్కర్లేదు. దాని సేవలను నేరుగా వాట్సాప్‌లోనూ వినియోగించుకోవచ్చునని ఓపెన్ ఏఐ ప్రకటించింది. వేరే యాప్, అకౌంట్‌తో సంబంధం లేకుండా నేరుగా వాట్సాప్‌లోనే దీనిని వాడవచ్చు. 18002428478 నంబర్‌తో వాట్సాప్‌లో చాట్ చేయవచ్చు. మనం అడిగిన సందేహాలు, ప్రశ్నలకు ఇది సమాధానం చెపుతుంది. ఇంతకాలం కెనడా, అమెరికాలకే పరిమితమైన సేవలు ఇకనుంచి భారత్‌లో కూడా పొందవచ్చు. అయితే దీని రోజువారీ వాడుకపై పరిమితి ఉంటుంది. మెటా ఏఐ చాట్‌బాట్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ దీనిని వాట్సాప్‌లో ప్రవేశపెట్టింది.

(మొదటి పేజీ తరువాయి..)

## యూజీసీ నెట్ పరీక్షల తేదీలు మార్పు

నిర్వహిస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ సెషన్ కు సంబంధించి పరీక్షల తేదీలను ఇప్పటికే యూజీసీ ప్రకటించింది. అయితే ఈ తేదీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి.. ఈ మేరకు మారిన పరీక్ష తేదీలతోపాటు పరీక్షల షెడ్యూల్‌ను యూజీసీ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. అందుకే యేటా రెండు సార్లు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహిస్తుంది. తాజా షెడ్యూల్ ప్రకారం జనవరి 3, 6, 7, 8, 9, 10, 15, 16 తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు యూజీసీ వెల్లడించింది. మొత్తం 85 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. కాగా యూజీసీ నెట్ డిసెంబర్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు కొనసాగిన విషయం తెలిసిందే. త్వరలోనే అడ్మిట్ కార్డులను యూజీసీ విడుదల చేయనుంది. కాగా యూజీసీ-నెట్ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతుంది. ఈ పరీక్ష మొత్తం రెండు పేపర్లకు ఉంటుంది. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. పేపర్ 1లో 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. మొత్తం 100 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పేపర్ 2లో 100 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష 3 గంటల వ్యవధిలో ఉంటుంది. పేపర్-1లో రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, డైరెర్జెంట్ థింకింగ్, జనరల్ అవేర్‌నెస్ వంటి అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఇక పేపర్ 2లో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు వస్తాయి. లాంగ్వేజెస్ సబ్జెక్టులు మినహా మిగతా అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మీడియంలలో మాత్రమే ఉంటుంది.

### ఇంకా సీఎం సీఎం అంటున్నారు..

## డిప్యూటీ సీఎం అయ్యాను కదా!

ఓజీ... సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. అయితే, ఆ అభిమానులపై పవన్ చిరు కోపం ప్రదర్శించారు. కొంచెం మందలిస్తున్న ధోరణిలో వ్యాఖ్యానించారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే... "నన్ను పని చేసుకోనివ్వండి. కనీసం రోడ్డు కూడా కనిపించనంతగా నా మీద పడిపోయారు. మీకందరికీ దణ్ణం పెడతాను... రోడ్డు చూడనివ్వండి నన్ను అని చెప్పాల్సి వచ్చింది. ఓజీ ఓజీ ఓజీ అంటూ అరుస్తున్నారు... లేకపోతే, ఇంతకుముందు సీఎం సీఎం అనేవాళ్లు... అదింకా పోలేదు... నేను డిప్యూటీ సీఎం అయినా గానీ వాళ్లకు ఆనందం కలగడంలేదు. అందరికీ నేను చెప్పేది ఒక్కటే... నేను వచ్చినప్పుడు అందరూ నన్ను చుట్టుముడితే పనులు జరగవు. నన్ను పనిచేయనివ్వండి. ఉత్తరాంధ్ర... ప్రజలకు తెలుగు వాడుక భాష నేర్పించిన నేల ఇది, తిరుగుబాటు నేర్పించిన నేల ఇది, ఎవరైనా దోపిడీ చేస్తుంటే ఎదురు తిరిగే నేల ఇది. కానీ ఇవాళ మీరు సినిమాల మోజులో పడి... ఓజీ ఓజీ అని పోస్టర్లు పెట్టి, జేజేలు కొడితే జీవితంలో ముందుకు వెళ్లలేరు. మాట్లాడితే చాలు... అన్నా మీసం తిప్పు, మీసం తిప్పు అంటారు. నేను మీసం తిప్పితే రోడ్ల నిర్మాణం జరుగుతుందా? నేను ఛాతీ గుద్దుకుంటే రోడ్లు పడతాయా?... నేను వెళ్లి ప్రధానమంత్రి గారికి దణ్ణం పెట్టి, సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళితే రోడ్లు పడతాయి. అందుకే, మీసాలు తిప్పడాలు, ఛాతీలు కొట్టుకోవడాలు నాకు చేతకావు... నాకు పనిచేయడమే తెలుసు" అంటూ పవన్ కల్యాణ్ అభిమానులకు హితోపదేశం చేశారు. గిరిజన గ్రామంలోని పరిస్థితులు చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాగుజోల గ్రామం నుంచి సిరివర వరకు రూ.9.50 కోట్లతో 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డుగా మార్చుతున్నామని తెలిపారు. గతంలో తాను పోరాట యాత్రలో భాగంగా పాడేరు, అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రధానంగా మూడు సమస్యలను గుర్తించానని... అవి రోడ్లు, తాగునీరు, యువతకు ఉపాధి అని వివరించారు. ఇక్కడికి రావాలని, ఇక్కడ రోడ్లు వేయాలని ఇప్పటిదాకా ఎవరూ ఆలోచించలేదని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం 2020-22 మధ్య వెనుకబడిన జిల్లాల కోసం రూ.670 కోట్లు ఇచ్చింది. ఆ నిధులు వస్తే, గత ప్రభుత్వం హయాంలో లెక్కా పత్రం లేకుండా చేశారు. తనకు అన్యాయం జరిగిందని చెప్పిన బిడ్డ మీ దగ్గర ఓట్లు వేయించుకున్నారు కానీ... గత ఐదేళ్ల పాలనలో మీకు రోడ్డు వేయలేకపోయారు. రుషికొండ ప్యాలెస్ కు రూ.500 కోట్లు ఖర్చు చేశారు కానీ... గిరిజన ప్రాంతం బాగుజోలలో ఒక రోడ్డు వేయలేకపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని ఒకటే అడిగాను... 70 ఏళ్లుగా ఇక్కడ రోడ్లు లేవు, బాలింతలను డోలీల్లో మోసుకెళ్లే పరిస్థితి ఉందని ఆయనకు వివరించాను. చంద్రబాబు గారి ఆధ్వర్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం తరఫున మీ అందరికీ మాటిస్తున్నాను... మీకోసం ఎండనకా, వాననకా అహర్నిశలు కష్టపడడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేస్తా..

విషయంలో కఠినంగా ఉంటాం" అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. రైతులు ఏ మిల్లులో ధాన్యం అమ్ముకోవాలనుకుంటే ఆ రైస్ మిల్లులో అమ్ముకోవచ్చని, రైతు అనుకూలతను బట్టి తనే ఎంచుకునే సదుపాయం కల్పిస్తామని చెప్పారు. దళారీ వ్యవస్థపై కచ్చితమైన చర్యలుంటాయని, దళారీ వ్యవస్థ ఉండేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. త్వరలో సైలోస్ సిస్టమ్ కూడా రైతులకు అందుబాటులోకి తీసుకుని రావాలని చూస్తున్నాము. సైలోస్ సిస్టమ్ అందుబాటులోకి వస్తే రైతులు కావాల్సిన సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీంతో నిల్వ పెట్టిన ధాన్యానికి ఎక్కువ రేటు వస్తుంది. ఎంటీయూ 1262 గత ఏడాది కృష్ణా జిల్లాలో 3,582 మెట్రిక్ టన్నులు దిగుబడి ఇస్తే.. ఈ ఏడాది 32,859 మెట్రిక్ టన్నులు దిగుబడిని ఇచ్చింది. ఇతర జిల్లాల్లోనూ ఈ పంట దిగుబడి ఎక్కువగా ఉంది... అని చంద్రబాబు వివరించారు. రైతుల ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ సీజన్ లో, ఎలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు వివరిస్తామని అన్నారు. ముఖ్యంగా, పంట చేతికొచ్చాక మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో రైతులకు అవగాహన కలిగిస్తామని చెప్పారు. ధాన్యానికి సంబంధించి తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండడం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోనె సంచుల పంపిణీలో రైస్ మిల్లులు పొరపాట్లు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, 5 కోట్ల గోనె సంచులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీల్లో డ్రైయర్లు ఏర్పాటు చేశామని, తేమ ఎక్కువగా ఉన్న చోట్ల డ్రైయర్లు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. 1,713 రైస్ మిల్లులకు గాను 394 మిల్లుల్లో మాత్రమే డ్రైయర్లు ఉన్నాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుకు అవకాశం ఉండాలని భావిస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ యంత్రాలు వచ్చాక రైతులు సంతోషంగా ఉన్నారని, ఎక్కువ దిగుబడికి కారణాలేంటి అనే అంశాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. గతేడాది కంటే ఈ ఏడాది, ఈ సమయానికి 40 శాతం ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే 3.20 లక్షల మంది రైతుల నుంచి 21.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 48 గంటల కంటే ముందే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి..)

పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లు క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

### ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

ఈ-ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ-ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ-కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని.. అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ- కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600 కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈ-రేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీష్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### కాపలా కుక్కలు వేట కుక్కలుగా మారి భూ దోపిడి చేశాయి

(మొదటి పేజీ తరువాయి..)

మంత్రి పొంగులేటి తెలిపారు,ఇటు రాష్ట్రంలో అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతాంగానికే కాకుండా యావత్తు ప్రజానీకానికి ఎంతో మేలు చేశాయని చెప్పడానికి గర్వపడుతున్నాను. అదే నిబద్ధత, అదే ఆశ, ఆశయాలతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి 2024 రెవెన్యూ చట్టం నిజమైన ప్రజా చట్టం - అక్షరాలా భూమి ఉన్న ప్రతి ఒక్కరికి చుట్టం.

దేశ రైతు చరిత్రను సరికొత్త సంస్కరణలతో లిఖించిన ముగ్గురు వ్యక్తుల గురించి ఇక్కడ చెప్పాలి. అదృష్టవశాత్తూ ఈ సంస్కరణల త్రయం తెలంగాణ బిడ్డలే కావడం మరో విశేషం. భూకమతాల పరిమితి చట్టం తెచ్చిన నాటి ముఖ్యమంత్రి, తెలుగు ప్రధాని పివి నరసింహారావు , కౌలు రైతులకు మేలు చేసే విధంగా రక్షిత కౌలుదారి చట్టం తీసుకువచ్చిన నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అదేవిధంగా జాగీర్ల రద్దులో కీలకంగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మాకు దిశానిర్దేశకులు అని మంత్రి అన్నారు ఇప్పుడు వారి అడుగుజాడల్లో ప్రజోపయోగమైన ఈనూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు,మన రాష్ట్రానికి సంబంధించి ఒక్కసారి గత చరిత్రను పరిశీలిస్తే భూమి కోసం, భుక్తికోసం... వేలాది పీడిత రైతులు, కూలీలు పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం.చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం అని మంత్రి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు,ఈ ఉద్యమానికి ప్రధానమైన కారణం నిజాం కాలంనాటి భూ సమస్యలే నిజాం సంస్థానంలోని ఉద్యోగులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు, దేశ్ పాండే లాంటి భూస్వాములంతా అధికార దర్పంతో ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆయన తెలిపారు,

వేలాది పుస్తకాలు చదివిన అపర మేధావిగా.నయా నిజాంగా పేరు ప్రఖ్యాతులు పొందిన గత ప్రభుత్వ పెద్దలు.ధరణి సృష్టికర్త కూడా ఇదే విధంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు.ధరణి సమస్యలను పరిష్కరించకలేకపోవడం, క్షేత్రస్థాయిలో బాధితుల బాధను అర్థం చేసుకోకుండా ధరణిలో ఎలాంటి సమస్యల్లేవంటూ ధరణి సృష్టికర్త బుకాయించారని మంత్రి ఆరోపించారు,

#### రెండు పిల్లుల రొట్టెకథ ఈ ధరణి

మనం చిన్నప్పుడు చదువుకున్న రెండు పిల్లులు రొట్టె కథలాగే ఈ ధరణి ఉంది. రొట్టె పంచుకోవడం కోసం ఆ రెండు పిల్లులు గొడవ పడడం, ఓ కోతి వచ్చి ఆగొడవ తీరుస్తానని చెప్పడం, ఆ రొట్టెను 2 ముక్కలు చేస్తూ ఒకటి ఎక్కువైందని ఒకసారి, రెండవ ముక్క ఎక్కువైందని మరోసారి రొట్టెను పూర్తిగా కోతి తినేయడం మనకు తెలిసిన కథ. ఆ కోతిలాగే గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలు ప్రవర్తించి భూములను దోచుకున్నారని మంత్రి ఆరోపించారు,ధరణిలో నా భూమి నేను చూసుకొనే వీల్లేదు. ఆనాడు అంతా రహస్యమే. ఇందిరమ్మ ప్రభుత్వంలో దొరలు, సామాన్యులకు ఒకటే విధానం. భూ భారతిలో అంతా పారదర్శకమే,ఆనాటి బ్రిటిష్ దొరలు జమీందారులు, భూస్వాముల వంటి దళారులను సృష్టించి శిస్తుల రూపంలో దోపిడీ చేస్తే ఈనాటి దొరలు భూముల డిజిటలైజేషన్ పేరుతో ధరణిని సృష్టించి భూదోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు,

#### తప్పు ఒకరిది శిక్ష మరొకరిది

అనాలోచితంగా రాత్రికి రాత్రే గడీల మధ్య చట్టం చేసి తప్పుచేసింది ఆదొరవారు. కానీ శిక్ష అనుభవిస్తుంది మాత్రం అమాయక పేదరైతులు,ఈ రాష్ట్రంలో ఏ మండలానికి వెళ్లినా , ఏగ్రామానికి వెళ్లినా ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా మనిషి అనే వాడు ఉన్న ప్రతిచోట ధరణి తెచ్చిన సమస్యలున్నాయని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు,

#### సిద్ధిపేట జిల్లాలో దళితరైతు ప్రాణం తీసిన ధరణి

సిద్ధపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మద్దెల కృష్ణయ్య (73) అనే దళిత రైతు ఇదే గ్రామానికి చెందిన ఎం. విజేందర్ రెడ్డి నుంచి 35 ఏళ్ల క్రితం 1452 సర్వే నెంబర్‌లో ఏడెకరాల భూమిని కొనుగోలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత 35 ఏళ్ల క్రితం కొన్నభూమి వేరే వాళ్ల పేరుపై పట్టాకావడంతో మనస్థాపం చెంది 22.01.2023న మద్దెల కృష్ణయ్య విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. అటువంటి పరిస్థితి ఇందిరమ్మ రాజ్యంలో మరొకరికి రాకుండా ఉండేలా భూ భారతి చట్టాన్ని రూపొందించాం.

ఈ పదేళ్లు తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుంది. ఆ పెద్దమనిషి చేసిన ఈ పాప ఫలితాన్ని అన్యాయంగా తెలంగాణ రైతాంగం అనుభవించాల్సిన దుస్థితి దాపురించిందని మండిపడ్డారు,

#### మొహం పగిలిపోయేలా ప్రజలు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో తీర్పు ఇచ్చినా బుద్ధి మారడం లేదు

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రూపొందాయని 1971లో ప్రవేశపెట్టిన రెవెన్యూ చట్టం విశేష సేవలందించింది.లక్షలాది మంది భూ హక్కుదారులను 2020 రెవెన్యూ చట్టంతో ఇబ్బంది పెట్టగా నేడు ఇందిరమ్మ రాజ్యంలో భూభారతి పేరిట దేశానికే ఓ రోల్ మోడల్ గా ఉండే రెవెన్యూ చట్టం ప్రవేశపెట్టడం నా అదృష్టమని మంత్రి శ్రీనివాసరెడ్డి అన్నారు,రాష్ట్రంలో గుంట భూమి ఉన్న ప్రతి ఒక్కరూ ఆసక్తిగా ఎదురుచూసే భూభారతి చట్టాన్ని సభలో ప్రవేశపెడుతుండగా సీనియర్‌లమని చెప్పుకొనే కొంతమంది ఇటు దళిత స్పీకర్ పైనా , కాంగ్రెస్ సభ్యులపైనా కాగితాలు విసరడం దురదృష్టకరం. సమ సమాజం సిగ్గుపడేలా బిఆర్ ఎస్ సభ్యులు ఇటువంటి గూండాయిజానికి పాల్పడడం దారుణం, దీనిపై స్పీకర్ గారు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

ప్రముఖ న్యాయకోవిదులు పడాల రామిరెడ్డి భూ సంస్కరణలపై రాసిన పుస్తకం ఎప్పుడూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ టేబుల్ పై కనిపించేదని తన సెల్ ఫోన్‌లోని ఫోటోను మంత్రి పొంగులేటి ప్రదర్శించారు. పడాల రామిరెడ్డి పుస్తకాల సహకారంతో, 80 వేలకు పైగా పుస్తకాలు చదివానని చెప్పుకుంటున్న కేసీఆర్ నేతృత్వంలో ఉన్నతస్థాయి రెవెన్యూ చట్టం వస్తుందని భావించానని, అయితే లోపభూయిష్టమైన, నాలుగు గోడల నడుమ రూపొందించిన 2020 రెవెన్యూ చట్టం ప్రజా కంటకమైందని, మూడేళ్లకే ఈ చట్టానికి నూరేళ్లు నిండిపోయాయనీ మంత్రి తెలిపారు,

అసెంబ్లీలో తొలిసారిగా మంత్రి హోదాలో తాను ఇటువంటి గొప్ప బిల్లును ప్రవేశపెడుతుండగా ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాకపోవడం సరికాదు. ప్రజలపై ఆయనకు ఉన్న నిబద్ధత ఏమిటో తెలుస్తుంది. భూభారతిపై సలహాలు సూచనల కోసం పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని, మరోవైపు సీనియర్ శాసనసభ్యులు హరీష్‌రావు ఏడు పేజీల సూచనలు ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. ఇటువంటి అత్యంత ప్రాధాన్యత ఉన్న బిల్లును ప్రవేశపెడుతుండగా కేవలం కేటిఆర్ పై నమోదైన వ్యక్తిగత కేసును తెరపైకి తెచ్చి శాసనసభలో గందరగోళం సృష్టించడం ఒక విధంగా రాష్ట్ర ప్రజలను అవమానించడం, వారి ఆశలపై నీళ్లు చల్లడమేనని మంత్రి పొంగులేటి అన్నారు.

## వచ్చే ఐదేళ్లలో ఈవీ రంగం వేగంగా అభివృద్ధి

- 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి..
- ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది
- భారత్‌లో ప్రారంభ దశలోనే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు
- వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు
- కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20( వెలుతురు):**
భారత్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) రంగం వచ్చే ఐదేళ్లలో వేగంగా అభివృద్ధి చెందుతుందని, 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం (డిసెంబరు 19) వెల్లడించారు. ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుందని అంచనా వేశారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి. మొత్తం వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ - డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగా EVలు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. ఇది మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే చాలా తక్కువ. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి, మొత్తం



వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాతో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మరియు డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగా EVలు రిజిస్టర్ అయ్యాయి, విభాగాల్లో మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే తక్కువ. కానీ 2030 నాటికి పరిస్థితి పూర్తిగా మారుతుందని మంత్రి అన్నారు. ఈవీ పర్యావరణ వ్యవస్థలో సుమారు 5 కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ప్రస్తుతం రూ.4.50 లక్షల కోట్లుగా ఉన్న మార్కెట్ ఐదు రెట్లు పెరిగి 2023 నాటికి రూ.20 లక్షల కోట్ల మార్కెట్‌కు చేరుకుంటుందని, భవిష్యత్తులో భారత్ గ్లోబల్ ఈవీ హబ్‌గా మారాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈవీల ఫైనాన్స్ మార్కెట్ పరిమాణం కూడా రూ.4 లక్షల కోట్లకు చేరొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం '8వ క్యాటలిస్ట్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబిలిటీ ఆఫ్ ఈవీ వెహికల్ ఇండస్ట్రీ- ఈవీఎక్స్‌పో 2024' సమావేశంలో మంత్రి ఈ మేరకు వెల్లడించారు. రవాణా రంగం నుంచే 40 శాతం వాయు కాలుష్యం నమోదవుతోందని, అలాగే శిలాజ ఇంధనాల దిగుమతులు రూ.22 లక్షల కోట్ల స్థాయికి చేరినట్లు తెలిపారు. ఇది అతి పెద్ద ఆర్థిక సవాలుగా ఇది మారిందని వివరించారు. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం హరిత ఇంధనంపై అధికంగా దృష్టి సారిస్తోందని, మొత్తం విద్యుత్‌లో 44 శాతం సౌర విద్యుత్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జల విద్యుత్, సౌర విద్యుత్, హరిత విద్యుత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

# తేమశాతంలో తేడా వస్తే చర్యలు తప్పవు

◆ సీఎం నారా చంద్రబాబునాయుడు



**అమరావతి, డిసెంబర్ 20 ( వెలుతురు):** తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రీడింగ్ రావాలని.. కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కృష్ణా జిల్లా గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది సీఎం చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా పండిందని రైతు వెల్లడించారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6 వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చిందని రైతు తెలిపారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని రైతు తెలిపారు. గతంలో మనుషులు కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని రైతు తెలిపారు. తొలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదని అన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకుని మనుషుల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదని చెప్పారు. ధాన్యం డబ్బుల్లో కోత లేదు.. డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందని అన్నారు. కోత మిషన్లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రోక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రోడెక్టివిటీ వచ్చిందో చెప్పాలని అన్నారు. ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. సీజన్ ముందు అన్ని మిషన్లను తేమ విషయంలో క్యాలిబ్రేట్ చేస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

# సెకండ్ ఇన్నింగ్స్ కు రెడీ అవుతున్న రోజా..

**అమరావతి, డిసెంబర్ 20 ( వెలుతురు):** తెలుగు రాజకీయాల్లో నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజా అంటే ఫైర్.. ఫైర్ అంటే రోజా అన్నట్లు వ్యవహరించారు. ప్రత్యర్థులపై ఆమె చేసే విమర్శలు అంత ఘాటుగా ఉంటాయి. ఏ అంశంలోనైనా ప్రత్యర్థుల్ని ఏకిపారేయడం రోజా స్టైల్. నగరి నుంచి వరుసగా రెండుసార్లు గెలిచిన రోజా ఆ నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గాలి భాను చేతిలో ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు.మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో రోజా భర్త, సోదరుల పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తినా ఆమె పట్టించుకోలేదు. చంద్రబాబు, లోకేష్, పవన్ లపై మితిమీరిన విమర్శలు, సొంత పార్టీలో వ్యతిరేక కుంపటి, మంత్రి అయ్యాక హంగు ఆర్భాటం, విలాసవంతమైన జీవితం, విదేశీ ప్రయాణాలు.. ఇవే రోజాకు ప్రస్తుతం శాపాలుగా మారాయి. ఆ ప్రభావంతో గత ఎన్నికలలో సూమారు 45 వేల ఓట్లతో ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల తరువాత ఏపీఐసీసీ చైర్మన్ గా, మంత్రిగా రోజాల చేసిన అక్రమాలతో పాటు, నియోజకవర్గం జరిగినా అవినీతిపై విచారణ కోరుతూ పెద్ద ఎత్తున కూటమి నేతలు సిఐడి కు ఫిర్యాదు చేశారు.ఆ క్రమంలో ఆడుదాం ఆంధ్ర, నగరిలో భూ అక్రమాలు, టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాలకు సంబంధించి కోట్ల రూపాయల అవినీతిపై సీఐడీ లోతుగా విచారణ జరుపుతుందట. ఆ ప్రభావంతో ఎన్నికల తరువాత అప్పుడప్పుడు తిరుపతి జిల్లాలో తళుక్కుమన్న రోజా గత కొంత కాలంగా అసలు ఇటు వైపు చూడటమే మానేశారు.



ఆమె చెన్నై, హైదరాబాదుల్లోనే ఎక్కువగా ఉంటున్నారు.సీఐడీ విచారణలతో రాజకీయంగా ఇబ్బందులు తప్పవని ఫిక్స్ అయిన అమె ఇప్పుడు రూట్ మార్చినట్లు టాక్ నడిస్తోంది.రోజా ఓడిపోయాక గతంలోలా పెద్దగా వాయిస్ వినిపించడం లేదు. అప్పుడప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎక్స్ వేదికగా మాత్రమే పోస్టులు పెడుతూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆ క్రమంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి సంబంధించి రోజా పెట్టిన ట్వీట్‌పై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘాటుగా స్పందించారు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం. ముందు ఆ ప్యాలెస్‌కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయట పెట్టండని భాను నిలదీయడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.రోజా బెంజికారు ఎపిసోడ్ వైరల్‌గా మారడంతో .. లేనిపోని తలనొప్పులు ఎందుకని రోజా ట్వీట్ లు పెట్టడం కూడా తగ్గించేశారు. పార్టీ ఆదేశిస్తే తప్ప తనుకు తానుగా బయటకు వచ్చి స్పందించడం మానేశారు. ట్వీట్లు సైతం పార్టీ పంపితే పెడుతూ సైలెంట్ గా ఉంటున్నారంట. ఈమధ్య షర్మిల సైతం రోజా పెడుతున్న పోస్టులు అమెవీ కాదని వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న పనే అని ఆరోపించారు.ఏదేమైనా మున్నుందు దూకుడుగా వెళితే ఇబ్బందులు అని తెలిసే రోజా మౌనంగా ఉంటున్నారనే టాక్ వైసీపీలో నడుస్తోంది. అందుకే పొలిటికల్ హీట్ నుండి తప్పించుకోవడానికి సినిమాల వైపు చూస్తున్నారట రోజా.. తాను క్యారెక్టర్ రోల్స్ చేయడానికి రెడీ అంటూ తన టీమ్ ద్వారా టాలీవుడ్‌లోని పలువురు దర్శకులకు, తమిళ సినిమా నిర్మాతలకు సంకేతాలు పంపిస్తున్నారంట. నిజానికి రాజకీయాల వల్ల సినిమాలకి గుడ్ బై చెప్పారు కానీ ఒకప్పుడు క్యారెక్టర్ రోల్స్‌తో టాలీవుడ్‌లో, టీవీ షోల్లో రోజా బిజీగానే ఉన్నారు.2013లో ఆమె టాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పారు. అప్పటి నుండి ఫుల్ టైమ్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. కానీ బుల్లితెరపై జబర్దస్త్, ఎక్స్‌ట్రా జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి షోలు, పలు ఫెస్టివల్ ఈవెంట్స్‌లో మాత్రం పాల్గొంటూ వచ్చారు .. మంత్రి పదవి వచ్చిన తర్వాత బుల్లితెరకి కూడా బైబై చెప్పేశారు. అయితే ఇటీవల జబర్దస్త్ కాకుండా ఎదైనా షోలో అవకాశం ఇస్తే చేస్తానని ఆమె ప్రకటించారు. మొన్నీమధ్య కేసీఆర్ అనే సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కి గెస్ట్‌గా రావడం, పుష్ప సినిమాను అద్భుతంగా ఉందంటూ పొగడటం లాంటివి స్క్రీన్‌పై రీఎంట్రీ ఇవ్వడానికే అంటున్నారు.అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెకు అవకాశాలు ఎంత ఎవరకు వస్తాయో అనేది డౌటే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. డిప్యూటీ సిఎంగా పవన్ ఉండటం, తాజాగా నాగబాబుకు మంత్రి గా అవకాశం రావడంతో.. చిరంజీవి నుండి పవన్ వరకు అందరి పైన తీవ్రస్థాయి విమర్శలు చేసిన రోజాకు సినిమా ఇండస్ట్రీ నుంచి ఏ మేరకు మద్దతు లభిస్తుంది అన్నది అనుమానంగానే మారింది .. మరి టాలీవుడ్‌లో తిరిగి మేకప్ వేసుకోవాలనుకుంటున్న రోజా కోరిక తీరకపోతే.. ఆమె తమిళ ఇండస్ట్రీకి షిఫ్ట్ అయిపోతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు

- నారా భువనేశ్వరి



అమరావతి, డిసెంబర్ 20 ( **వెలుతురు**): అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లాలోని కుప్పంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమె పర్యటన కొనసాగింది. వనగుట్టపల్లిలో రచ్చబండ వద్ద మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్లతో పేదలకు అన్నం పెడుతున్నామని, పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కుప్పాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామని నారా భువనేశ్వరి అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ హాయంలో రాష్ట్రంలో ఇండస్ట్రీలు భయపడి అన్నీ వెనక్కి వెళ్ళిపోయాయని, చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఇప్పుడిప్పుడే పరిశ్రమలు వస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమం చేస్తున్నామని, నిరుపేద కుటుంబాలకు విద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఆర్థికంగా సహాయ సాకారం అందిస్తున్నామని తెలిపారు. కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, వీధి దీపాలు, కాలువలు నూరు శాతం పూర్తి చేస్తారని తెలిపారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి రైతులకు నీరును అందుబాటులో తెస్తారని, రైతులు పండించే పంటల కోసం కార్గో ఎయిర్‌పోర్టు విమానాశ్రయాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారని నారా భువనేశ్వరి చెప్పారు. వైఎస్సార్‌సీపీ హాయంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు గంజాయి లేకుండా యావత్ ఆంధ్రప్రదేశ్‌లోని కమిటీ ఒకటి వేశారని తెలిపారు. కరువు రహితం అనేది ఆంధ్ర రాష్ట్రంలో విజన్ 2047 ప్రారంభించారని, ఆంధ్రప్రదేశ్ ప్రశాంతంగా.. రోల్ మోడల్‌గా చేసి ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలతో సంతోషంగా ఉండాలనే మంచి ఆలోచనతో.. ధ్యేయంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారని అన్నారు. కుప్పం రుణం తీర్చుకుంటామని.. తమ కుటుంబం ఎప్పుడు ప్రజలకు కట్టుబడి ఉంటామని, టీడీపీ కార్యకర్తలను ఎప్పుడు మర్చిపోలేమని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు.

# విచారణకు హాజరైన దువ్వాడ శ్రీనివాస్



**శ్రీకాకుళం జిల్లా,డిసెంబర్ 20 ( వెలుతురు):** వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురితో కలసి పోలీసుల విచారణకు హాజరయ్యారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అతనిపై స్థానిక జనసేన నేతలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. నవంబర్ 18 న కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు.. దువ్వాడకు 41 ఏ నోటీసులు ఇచ్చి.. విచారణకు రావాలని పేర్కొన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం మధురితో కలిసి విచారణకు వచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై అనేక కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు టెక్కలి పోలీసులు షాక్ ఇచ్చారు. విచారణకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు 41ఏ నోటీసులు జారీ చేసింది. తాజాగా దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవన్ కళ్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో స్పందించిన పోలీసులు.. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులపై స్పందించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తాను భయపడేది లేదన్నారు. టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని, వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తన కారుకు కూడా నిప్పంటించారని, చంపేస్తామని బెదిరించారని వ్యాఖ్యానించారు. జనసేన కార్యకర్తల ఆగడాలపై తాను పోలీస్ స్టేషన్‌లో సాక్షాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంపై దువ్వాడ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దువ్వాడ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.

# గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్య

◆ హైకోర్టును ఆశ్రయించిన భర్త

**అహ్మదాబాద్,డిసెంబర్ 20 ( వెలుతురు):** గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్యను వెతికి పెట్టాలంటూ ఒక వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. స్వలింగ సంపర్కురాలైన తన భార్య అక్టోబర్‌లో తన ప్రియురాలితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, ఆ సమయానికి ఆమె ఏడునెలల గర్భవతి అని ఆయన కోర్టుకు విన్నవించాడు. దీనిపై చాంద్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు తన భార్య ఆచూకీని కనుగొనలేకపోయారని తెలిపాడు. కాగా, ఆమెను ఈ నెల 23లోగా తమ ముందు హాజరుపర్చాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.





# టార్గెట్ టాలీవుడ్...?

**హైదరాబాద్, డిసెంబర్ 16, వెలుతురు:** తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తన మార్క్ చూపించారు. మార్పు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి పాలనా విధానంలో ఎన్నో మార్పులు తెచ్చారు. మొదటగా సీఎం రేవంత్ హైడ్రా ప్రవేశ పెట్టి అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టించారు. పేద ధనిక అనే తారతమ్యం లేకుండా అందరినీ ఒకేలా చూశారు. హైడ్రా పేరుతో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ హైడ్రా బాదితుల్లో సినీ ఇండస్ట్రీ నుంచి అక్కినేని నాగార్జున ఒకరు. మొదట్లోనే హైడ్రా పేరుతో నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌ను నేలమట్టం చేసి సంచలనం సృష్టించారు. మాదాపూర్ లోని ఒక చెరువును కబ్జా చేసి నాగార్జున ఎన్ కన్వెన్షన్ అక్రమంగా నిర్మించారని హైడ్రా అధికారులు గుర్తించారు. దీంతో బుల్డోజర్‌ను మొదటిగా నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ పైకి పంపించి దాన్ని నేలమట్టం చేశారు. దీంతో నాగార్జున కోర్టు మెట్లు ఎక్కినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను కొందరు సమర్థించారు. సీఎం అంటే ఇలానే ఉండాలి అంటూ పొగడ్తలు కురిపించారు. ఇక హైడ్రాతో షాక్ తిన్న నాగార్జునకు కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలు అక్కినేని కుటుంబంలో నిద్రలేని రాత్రులకు కారణం అయ్యాయి.

**అక్కినేని ఫ్యామిలీపై మంత్రి సురేఖ సంచలన ఆరోపణలు**

నాగ చైతన్య – సమంత విడిపోవడానికి కేటీఆరే కారణం అంటూ మంత్రి సురేఖ చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. గతంలో కేటీఆర్–నాగార్జున మధ్య ఒక డీలింగ్ కుదిరిందన్నారు. ఎన్ కన్వెన్షన్ జోలికి రాకుండా ఉండాలంటే సమంతను తన దగ్గరకు పంపాలని కేటీఆర్ నాగార్జునతో చెప్పారని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో నాగార్జున.. సమంతను కేటీఆర్ దగ్గరకు పంపించే ప్రయత్నం చేశారని.. దీనికి ఒప్పుకోకపోవడంతోనే సమంతను ఇంటిలోనుంచి బయటకు పంపించేశారని మంత్రి సురేఖ ఘోరమైన ఆరోపణలు చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై సినీ ఇండస్ట్రీ నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఒక మంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమంటూ సినీ ఇండస్ట్రీ ప్రముఖులు ఖండించారు. వెంటనే మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పాలంటూ పలువురు డిమాండ్ చేశారు.

**కోర్టుకు నాగార్జున:**

దీంతో సమంతకు.. మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పింది. మరోవైపు నాగార్జు, కేటీఆర్ వేరు వేరుగా ఆమెపై పరువునష్టం దావా వేశారు. ఒక మంత్రి స్థాయిలో ఉండి సురేఖ తన ఫ్యామిలీపై తీవ్ర ఆరోపణలు చేశారని నాగార్జున కోర్టులో ఆవేదన చెందారు. సమాజంలో తమ ఫ్యామిలీకి ఎంతో పరువు ప్రతిష్ఠ ఉందన్నారు. ఆమె వ్యాఖ్యలతో వాటికి భంగం కలిగిందని భావోద్వేగానికి గురయ్యారు. దీంతో కోర్టు ఆమెకు వార్నింగ్ ఇచ్చింది. ఇంకెప్పుడూ ఇలాంటి ఆరోపణలు చేయరాదని కోర్టు పేర్కొంది. మరోవైపు సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆమె ఆరోపణల వీడియోలు డిలీట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీని అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఇండస్ట్రీలోని స్టార్ హీరో సినిమాకు భారీ షాక్ ఇచ్చింది. జూ. ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాకు ఊహించని దెబ్బ కొట్టింది. ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ఊహించని రీతిలో రద్దయింది. ముందుగా ఈ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు పర్మిషన్ కోరితే ప్రభుత్వం నిరాకరించింది. దీంతో హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఈవెంట్ నిర్వహించగా జనం భారీగా తరలి రావడంతో హోటల్ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు తారక్ ఫ్యాన్స్‌పై లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో ప్రభుత్వం తీరుపై ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా ప్రీమియర్స్‌లో భారీ ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ప్రీమియర్ చూసేందుకు బన్నీ రావడంతో ఫ్యాన్స్ అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో తొక్కిసలాట జరగగా.. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు తీవ్ర గాయాలతో హాస్పిటల్ పాలయ్యాడు. దీంతో పోలీసులు అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే బన్నీని పోలీసులు రీసెంట్‌గా అరెస్టు చేశారు. అక్కడితో ఆగకుండా కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన నాంపల్లి కోర్టు బన్నీకి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో బన్నీని చంచల్ గూడ జైలుకు తరలించారు. అదే సమయంలో హైకోర్టు ఈ కేసును విచారించి బన్నీకి 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇక ఇలా వెళ్లి అలా వచ్చేస్తాడనుకున్న బన్నీకి అక్కడ కూడా షాక్ తగిలింది. కోర్టు ఆదేశాలు తమకు ఇంకా అందలేదని జైలు అధికారులు రాత్రంతా బన్నీని జైల్లోనే పెట్టారు. ఇది మరింత సంచలనం అయింది. రాత్రంతా బన్నీ జైల్లో కిందనే పడుకున్నడని వార్తలు వచ్చాయి. మరుసటి రోజు బన్నీ బయటకొచ్చాడు.

**బాలకృష్ణకు రేవంత్ సర్కార్ షాక్:**

సీఎం రేవంత్ రెడ్డి నెక్ట్స్ టార్గెట్ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ సమీపంలో ఉన్న బాలయ్య నివాసానికి ముంపు పొంచి ఉంది. ఫిల్మ్‌నగర్ రోడ్ నంబర్ 45లోని బాలకృష్ణ ఇంటికి 6 అడుగుల మేర జీహెచ్ఎంసీ అధికారులు మార్కింగ్ వేశారు. దీంతో బాలయ్య ఇంటికి సంబంధించి ఉఊఓఅ అధికారులు 6 అడుగుల మేర నేలమట్టం చేయనున్నారన్న ప్రచారం జోరుగా సగుతోంది.బాలకృష్ణ – సీఎం రేవంత్ రెడ్డి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ ఏడాది హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో బసవతారకం హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సీఎం కాకముందు ఓ సినిమా ఫంక్షన్లోనూ బాలయ్యపై రేవంత్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో బాలయ్య విషయంలో రేవంత్ సర్కార్ వ్యవహారం ఎలా ఉండబోతుందనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది.

# అమరన్‌కు అవార్డుల పంట..

## ఉత్తమ నటుడిగా విజయ్‌సేతుపతి






కోలీవుడ్ నుంచి తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్న వారిలో లీడింగ్‌లో ఉంటారు విజయ్ సేతుపతి, సాయిపల్లవి. సినిమా సినిమాకు తమ పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేయడం ఈ స్టార్ యాక్టర్ల స్పెషాలిటీ. తాజాగా ఇద్దరు ఉత్తమ నటులుగా అవార్డులు అందుకుని వార్తల్లో నిలిచారు. 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 19న ముగిసింది. ఈవెంట్‌లో వివిధ కేటిగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. సాయిపల్లవి ఇటీవలే అమరన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఈ మూవీ ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి మహారాజ చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. వీరితోపాటు పలు సినిమాలకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి.

### అవార్డ్ విజేతలు..

అమరన్ :
ఉత్తమ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్
ఉత్తమ సంగీత దర్శకుడు: జీవీ ప్రకాశ్ కుమార్
మహారాజ :
ఉత్తమ నటుడు: విజయ్ సేతుపతి
ఉత్తమ రచయిత: నిథిలన్ స్వామి నాథన్
ఉత్తమ సహాయ నటి: దుషారా విజయన్ (వెట్టైయాన్)
ఉత్తమ దర్శకుడు (స్పెషల్ జ్యూరీ అవార్డ్) : పా రంజిత్ (తంగలాన్)
ఫేవరేట్ యాక్టర్ అవార్డ్ : అరవింద్ స్వామి

# 'ముఫాసా' ది లయన్ కింగ్' సరికొత్త రికార్డు




సోషల్ మీడియా ట్రెండ్స్‌లో మహేష్ బాబు ఫ్యాన్స్ అందరి హీరోల అభిమానుల కంటే ముందుంటారు. అలాగే టికెట్స్ బుకింగ్స్, కలెక్షన్స్ విషయంలోను కొత్త హిస్టరీలను ఎప్పటికప్పుడు కొత్తగా సృష్టిస్తూనే ఉంటారు. ప్రస్తుతం మహేష్ సినిమా ఏది రిలీజ్ లేకపోయినప్పటికీ బాబు ఫ్యాన్స్ సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కించిన 'ముఫాసా' ది లయన్ కింగ్' నేడు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయ్యింది. ఇంగ్లీష్ వెర్షన్ కి ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులువాయిస్ అందించగా హిందీలో షారుఖ్ ఖాన్ తన గాత్రాన్ని అందించారు. ఇక తెలుగులో మహేష్ బాబు, సత్యదేవ్, బ్రహ్మానందం, అలీ తదితరులు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ లో ఈ మూవీ ఉదయం 8 గంటల షో హౌస్ ఫుల్ అయ్యింది. అయితే ఈ సినిమాకి ఇండియాలోని అన్ని థియేటర్ల కన్న ముందే ఫుల్ కావడం విశేషం. ఇది కంప్లీట్‌గా మహేష్ బాబు ఫ్యాన్స్ డామినేషన్. కేవలం వాయిస్‌కే కటౌట్లు పెట్టి, హౌస్ ఫుల్స్‌తో రికార్డులు నెలకొల్పుతున్న మ్యాడ్‌నెస్ ఆయన అభిమానులకు మాత్రమే సొంతం. మరోవైపు మహేష్, రాజమౌళి సినిమా జనవరి ద్వితీయార్థంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి షూటింగ్ మొదలుపెడతారు. ఇప్పటికే ఏర్పాటు జరుగుతున్నాయి. అయితే రాజమౌళి స్క్రిప్ట్ విషయంలో ఇంకాస్త సమయం తీసుకోబోతున్నారని, ఏప్రిల్ వరకూ షూటింగ్ మొదలు కాదని అనుకున్నారు. అయితే జనవరిలోనే ఈ సినిమా ప్రారంభానికి శ్రీకారం చుట్టడం అభిమానులకు కాస్త ఆశ్చర్యంగా ఉంది.

# ఇవెంట్‌లో సందడి చేసిన అభిషేక్.. ఐశ్వర్య

బాలీవుడ్ స్టార్ సెలబ్రిటీ కపుల్స్‌లో టాప్‌లో ఉంటారు అభిషేక్ బచ్చన్-ఐశ్వర్యారాయ్. సిల్వర్ స్క్రీన్‌పై పలు సినిమాల్లో మెరిసిన ఈ ఇద్దరు లవ్ మ్యారేజ్ చేసుకున్నారని తెలిసిందే. వీరి కూతురు ఆరాధ్య. అయితే ఐష్-అభిషేక్ విడిపోతున్నారంటూ సోషల్ మీడియాలో కొన్నాళ్లుగా పుకార్లు షికారు చేస్తున్నాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవల జరిగిన అనంత్ అంబానీ వెడ్డింగ్ ఈవెంట్‌కు ఐశ్వర్యారాయ్ తన కూతురుతో కలిసి సింగిల్‌గా హాజరవడంతో.. ఐష్ అత్తవారింట్లో మనస్పర్థలు రావడం కారణంగా తన భర్త అభిషేక్ బచ్చన్ ఇంటి నుంచి బయటకు వచ్చి విడిగా ఉంటోందంటూ వార్తలు హల్ చల్ చేశాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే అభిషేక్ బచ్చన్ ఓ ఇంటర్వ్యూలో తన వెడ్డింగ్ రింగ్‌ను చూపిస్తూ.. క్షమించండి.. నేనిప్పటికీ పెళ్లి చేసుకునే ఉన్నా.. అంటూ రిప్లై ఇచ్చి విడాకుల రూమర్లకు చెక్ పెట్టేశాడు. అయితే ఆరాధ్య ముంబై ధీరూభాయ్ అంబానీ స్కూల్‌లో చదువుతుండగా.. తాజాగా ఈ స్కూల్ వార్షికోత్సవంలో బీటౌన్ సెలబ్రిటీలు సందడి చేశారు. ఈ గ్యాంగ్‌లో అభిషేక్ బచ్చన్-ఐశ్వర్యారాయ్ కలిసి కనిపించారు. ఈ స్టార్ కపుల్ హాయిగా నవ్వుతూ కనిపించారు. అమితాబ్ బచ్చన్ కూడా ఈవెంట్‌లో సందడి చేశారు. మొత్తానికి ఐష్-అభిషేక్ కలిసి కనిపించి తమపై వస్తున్న పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని వైవాహిక జీవితాన్ని సాఫీగా కొనసాగిస్తున్నారని తాజా ఫోటోలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.



# సూపర్ స్టైలిష్‌గా సోహైల్‌ఖాన్

## ఎన్‌కెఆర్ 21లో పాత్ర ఏంటోమరీ..?




బింబిసార తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్21. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ఇప్పటికే 21 అనౌన్స్ మెంట్ పోస్టర్ లాంచ్ చేశారని తెలిసిందే. ఇందులో పిడికిలి బిగించి ఉన్న కల్యాణ్ రామ్ చేతిపై రక్తపు మరకలు చూడొచ్చు. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సోహైల్‌ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా మేకర్స్ సోహైల్‌ఖాన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంతో సోహైల్ ఖాన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తుండగా.. ఇంతకీ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీలో సయీ మంజ్రేకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో అశోక్ వర్ధన్ ముప్ప, సునీల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో వస్తోన్న రెండో సినిమా ఇది. ఈ చిత్రంలో క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం మేకర్స్ ఏకంగా రూ.8 కోట్లు ఖర్చు పెట్టారని ఇన్‌సైడ్ టాక్. బ్రహ్మ కడలి టీం వేసిన సెట్ డిజైన్‌లో ఫైట్ మాస్టర్ రామకృష్ణ నేతృత్వంలో కల్యాణ్ రామ్‌తోపాటు సుమారు 1000 మంది ఆర్టిస్టులపై వచ్చే ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగనుందట.

### అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు అలర్ట్..

# ఇకనుంచి రెండు డివైజ్‌లు మాత్రమే.!




ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో తమ యూజర్లకు షాకిచ్చింది. వచ్చే ఏడాది నుంచి డివైజ్‌ల వాడకంలో పరిమితిని విధించనున్నట్లు ప్రకటించింది. ఇండియాలో ఉన్న టాప్ ఓటీటీలలో అమెజాన్ ప్రైమ్ వీడియో ఒకటి. నెట్‌ఫ్లిక్స్ తర్వాత ఆ రేంజ్‌లో హాలీవుడ్ కంటెంట్‌ను అందిస్తువస్తుంది. అయితే ప్రైమ్ యూజర్లకు ఓటీటీ బెనిఫిట్స్‌తో పాటు అమెజాన్ ఈ కామర్స్ సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రైమ్ మెంబర్ అయిన వారికి ఒకరోజులోనే డెలివరీలను అందిస్తుంది. ఇదిలావుంటే ప్రైమ్ వీడియో తమ యూజర్లకు షాక్‌ను ఇస్తూ.. సంచలన ప్రకటన విడుదల చేసింది.వచ్చే ఏడాది నుంచి ప్రైమ్ వీడియోలో డివైజ్‌ల వాడకంపై పరిమితి విధించనున్నట్లు ప్రకటించింది. ఇంతకుముందు ఒక్క ప్రైమ్ అకౌంట్‌తో ఒకేసారి 5 డివైజ్‌లు వాడుకోవచ్చు అన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా తీసుకువస్తున్న ప్లాన్ ప్రకారం.. 5 డివైజ్‌లు సంఖ్యను అలానే ఉంచి.. టీవీ డివైజ్‌లకు సంబంధించి పరిమితి విధిస్తుంది. కొత్త ప్లాన్ ప్రకారం.. ఒక్క అకౌంట్‌తో రెండు టీవీ డివైజ్‌లలో మాత్రమే రానుంది. అంతకంటే ఎక్కువ టీవీల్లో రావాలి అంటే ప్రీమియమ్ లేదా కొత్త ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించింది. జనవరి నుంచి ఈ మార్పు అమల్లోకి రానుందని పేర్కొంది.

# నటి పావని కరణంకు ట్రోలింగ్ సెగ


పుష్ప 2' సినిమాలో అల్లు అర్జున్ పాత్ర స్వభావాన్ని మార్చి సినిమాలో బిగ్ ట్విస్ట్ తెప్పించిన నటి పావని కరణం. అజయ్ కూతురిగా పుష్పరాజ్ ని చిన్నాయన అంటూ పిలుస్తూ కావేరి పాత్రలో అలరించిన ఆమెకు ప్రస్తుతం ట్రోలింగ్ సెగ తగులుతుంది. సినిమాలో ఆమెపై చేయేస్తేనే ప్రాణాలు తీసిన పుష్పరాజ్ రియల్ లైఫ్‌లో అయితే రాలేదు కదా! ఇంతకీ ఏం జరిగిందంటే.. మంచి థియేటర్ యాక్టింగ్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న పావనిని చూసి సుక్కు ఇంప్రెస్ అయ్యి ఆమెకు పుష్ప ఫ్రాంచైజీ లో చోటు కల్పించాడు. అంతకు ముందు ఆమె తిరువీర్ 'పరేషాన్' మూవీలో ఫిమేల్ లీడ్‌గా కనిపిచింది. ప్రస్తుతం కావేరిగా ఫేమస్ అయినా 'సమోసా తింటవా శిరీషా' ఐకానిక్ డైలాగ్ తో అందరికి పరిచయమే. అయితే 'పుష్ప 2'తో గ్రాండ్ సక్సెస్ అందుకున్న ఆమె వరుస పోస్టులతో సుకుమార్‌కి, అల్లు అర్జున్‌కి కృతజ్ఞతలు చెప్పుకుంది. ఒకటి, రెండు పోస్టులు వరకు ఓపిక పట్టిన నెటిజన్లు ఆ పోస్టులు కాస్త 4, 5 కావడంతో చిరాకు పడుతున్నారు. దీంతో ఆమె పోస్టుల క్రింద ఇక ఆపేయ్ చిరాకు వేస్తుంది అని కామెంట్ చేస్తున్నారు. కావేరి పాత్రను పార్ట్ 1లోనే లేపేసి ఉంటే మాకు ఈ నస తప్పేది అంటూ కామెంట్ చేస్తున్నారు.



# పుష్ప-2కు ఆ రెండు సినిమాలే టార్గెట్

## ఇప్పటి వరకు రూ.1508 కోట్ల గ్రాస్ దాటిన పుష్ప-2

భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై న పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్ఆర్ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్థమవుతోంది. పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి,




జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.

# కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ కుట్ర


◆ కావాలనే బీఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం : హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచే శారు. తాము ఎలాంటి తప్పు చేయలేద న్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ నిర్ణయం తీసుకున్నామన్నారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా మేం కూడా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టింది అక్రమ కేసు కాకుంటే ఈ సభలో చర్చించాలన్నారు. తాము తప్పు చేయలేదని.. రాష్ట్రం కోసం చేశామని కేటీఆర్ చెప్పారన్నారు. అక్రమ కేసు పెట్టినప్పుడు కేటీఆర్‌కు చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై నిలదీస్తున్నందుకు, లగచర్ల రైతుల తరఫున పోరాటం చేస్తున్నందుకు కేటీఆర్‌పై కేసు పెట్టారని విమర్శించారు. ఈ క్రమంలో సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములా-ఈ రేస్ విషయం లో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. అది ఒక సభ్యుడికి సంబంధించ అంశమని, ముందు బిల్లులపై చర్చిద్దామని స్పీకర్ అన్నారు. అందుకు ఒప్పుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు పట్టుపట్టారు. భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

# తెలంగాణ భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు





**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ-కార్ రేసులో ఏసీబీ కేసు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు భద్రత ఏర్పాటు చేశారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ-కార్ రేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై కేసు నమోదైంది. ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఇప్పటికే పథకం ప్రకారం గవర్నర్ అనుమతి సైతం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఐఏఎస్ దానకిశోర్‌తో ఫిర్యాదు చేయించి, అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. గవర్నర్ నుంచి అనుమతి లభించిన వెంటనే ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని మంగళవారం సీఎస్ శాంతికుమారి ఏసీబీకి లేఖ రాశారు. దీంతో బుధవారం సాయం త్రం ఎంఏయూడీ సెక్రటరీ దాన కిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ తెలిపారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1) (ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ సహా ఇతర అధికారులను విచారించేందుకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా బృందాన్ని విచారణ కోసం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ టీమ్‌లో పది మంది సిబ్బంది ఉన్నట్టు సమాచారం. విచారణ వివరాలు ఎప్పటికప్పుడు ఏసీబీ ఉన్నతాధికారికి, వారి నుంచి ప్రభుత్వానికి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేటీఆర్‌కు త్వరలోనే విచారణ నోటీసులను ఏసీబీ అధికారులు ఇవ్వనున్నారు. ఇప్పటికే కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్ర ప్రజలకు ఈ-కార్ రేస్ గురించి వాస్తవాలు వెల్లడించడంతో ఆయనను అక్రమంగానైనా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే పలు అక్రమ అరెస్టులతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో కేటీఆర్ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ ముగిసిన వెంటనే నోటీసులు అందజేస్తారని సమాచారం.

## అసెంబ్లీలో గందరగోళ వాతావరణం

◆ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వాటర్ బాటిళ్లు విసిరారని ఆరోపణ



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అధికార పార్టీ ఎమ్మెల్యే శంకర్ వాటర్ బాటిల్, పేపర్లు విసిరారు. విపక్ష సభ్యులకు చెప్పు చూపించాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఆరో రోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫార్ములా ఈ కార్ రేస్‌పై సభలో చర్చించాలని బీఆర్ఎస్ పట్టుపట్టింది. సమావేశాలు జరుగుతున్నప్పుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, అక్రమ కేసు పెట్టినప్పుడు ఆయనకు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని హరీశ్ రావు స్పీకర్‌ను కోరారు. దీనికి స్పీకర్ ప్రసాద్ కుమార్ నిరాకరించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ భారతి బిల్లుపై చర్చను ప్రారంభించారు. అయితే ఫార్ములా రేస్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే స్పీకర్ పోడియం వద్ద నిరసనకు దిగారు. దీంతో మంత్రి వెనుక సీట్లో కూర్చున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ ఆగ్రహంతో ఊగిపోయారు. తన చైర్‌లోనుంచి లేచి ప్రతిపక్ష ఎమ్మెల్యేలపైకి వాటర్ బాటిల్, పేపర్లు విసిరారు. కాగా, విపక్ష సభ్యులకు శంకరయ్య చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ పూర్తి వీడియోను బయటపెట్టాలన్నారు.

## ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే..

◆ తలసాని శ్రీనివాస్‌యాదవ్



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలో తమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అన్ని విధాల సభకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

# హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై క్వాష్ పిటిషన్ వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరఫు లాయర్లు జస్టిస్ శ్రవణ్ కుమార్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత పిటిషన్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారించనుంది. కాగా, లంచ్ మోషన్‌ను సింగిల్ బెంచ్ తిరస్కరించడంతో.. సీజే బెంచ్ ముందు పిటిషన్‌ను దాఖలు చేశారు. కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ-కార్ రేసులో కేటీఆర్‌పై కేసు నమోదైంది. ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. దీంతో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1)(ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

◆ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి, డిసెంబర్ 20 (వెలుతురు):** త్వరలో మహిళలకు ఉచిత బస్ సదుపాయం కల్పిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఏపీఎస్ఆర్టీసీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ద్వారకా బస్ స్టేషన్‌లో ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీ సర్వీస్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... కార్గో సర్వీస్‌ను డోర్ డెలివరీ ప్రారంభించటం సంతోషంగా ఉందని చెప్పారు. గ్రామాల నుంచి నగరాలకు అనుసంధనం చేసే ఘనత ఏపీఎస్ఆర్టీసీ సొంతమన్నారు. ప్రజలకు సేవ చేసే సిబ్బంది మరింత చేరువ కావటానికి డోర్ డెలివరీ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. సంస్థలో పని చేసే వారికి మంచి ఫలితాలు అందించేందు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భారత్ దేశంలో నంబర్ వన్‌గా ఏపీఎస్ఆర్టీసీను నిలబెడతామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మంచి బస్సులను ప్రయాణికుల కోసం సిద్ధం చేశామన్నారు. కొద్ది రోజుల్లో 500 కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రయాణికుల భద్రతకు ఏపీఎస్ఆర్టీసీ ముందు ఉంటుందని అన్నారు. కష్ట నష్టాలు ఉన్న ఏపీఎస్ఆర్టీసీ నడుస్తూనే ప్రజలకు సేవ చేస్తూ ఉంటుందని వివరించారు. జగన్ ప్రభుత్వంలో ఆర్టీసీ భూములు అన్యాక్రాంతం జరిగాయని ఆరోపించారు. ఆక్రమణలకు గురైన ఏపీఎస్ఆర్టీసీ భూములు వెనక్కి తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఫార్ములా-ఈరేస్ కేసులో అణాపైసా అవినీతి జరగలేదు

◆ న్యాయపరంగానే అన్నీ ఎదుర్కొంటాం : కేటీఆర్




**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. దానికి ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు. ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు సేకరించవచ్చని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ తరహాలోనే ఓఆర్ఆర్ లీజు నుంచి డబ్బులను సేకరించాం. ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపై హెచ్ఎండిఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి ఆ లీజును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన పరిధిలో ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి. తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఓఆర్ఆర్ లీజును వెంటనే రద్దుచేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీని కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. న్యాయమూర్తి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి. కోకాపేట భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం అంటున్నారు. స్కామ్ అయితే ఆ భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి' అన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చి స్పీకర్, ప్రతిపక్ష సభ్యులపైకి వాటర్ బాటిళ్లు, పేపర్లు విసరడం ఎలా అని శిక్షణ ఇచ్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దళితుడు అంటూ పదే పదే చెప్పడం స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా చేయడమేనన్నారు.

## హామీలు మరిపించటానికే తప్పుడు కేసులు

◆ కేటీఆర్‌పై చిల్లర కేసు.. విచారణలో అన్ని తేలుతాయ్ : జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వెలుతురు):** ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు ఎన్నో ఎంక్వయిరీలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా వన్ రేసుపై సమాధానం చెప్పడానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని జగదీష్ రెడ్డి చెప్పారు. చర్చ పెట్టకుండా ఎందుకు పారిపోతున్నారని, దమ్ము లేదా..? అని ఆయన ప్రశ్నించారు. రైతు రుణ మాఫీ, మహిళా సమస్యలపై అసెంబ్లీలో చర్చనే లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అప్పు నాలుగు లక్షల కోట్లేనని ఆర్బీఐ స్పష్టం చేసిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా వన్‌పై చర్చ కచ్చితంగా జరగాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో 1.2 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని, దీన్నిబట్టి వాళ్ళు ఐదేళ్లలో ఏడు లక్షల కోట్ల అప్పు చేస్తారని అన్నారు. అసత్యాలతో బీఆర్ఎస్ పార్టీని బయపెట్టలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వెధవ వేషాలు వేసినా ప్రజాక్షేత్రంలో, శాసనసభలో నిలదీస్తామని జగదీష్ రెడ్డి అన్నారు. ఫార్ములా వన్‌పై తప్పక అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని, బడే భాయ్, చోటే భాయ్ ఒకే లైన్‌లో ఉన్నారని ఆరోపించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com